# బాధితులకు సొత్తు అందజేత



**మార్కాపురం-నవభూమి** నగదు, బంగారు ఆభరణాలు పోగొట్టుకున్న బాధితులకు సాంకేతికత సాయంతో మార్కా పురం పోలీసులు 24 గంటల వ్యవధిలోనే కేసును పరిష్కరించి వారికి న్యాయం చేశారు. మార్కాపురం సీఐ పి.సుబ్బారావు కథనం మేరకు పెద్దదోర్నాల మండలం రామ చంద్రకోట గ్రామానికి చెందిన వెన్నా కాశిరెడ్డి, ధనలక్ష్మి దంపతులు బు?ధవారం మధ్యాహ్నం పట్టణానికి వచ్చారు. స్థానిక అరవింద స్కూల్ సమీపంలోని ధనలక్ష్మి అక్క కుమారి ఇంట్లో ఉన్నారు. అదేరోజు రాత్రి 7.45 గంటలకు కాశిరెడ్డి, ధనలక్ష్మి దంపతులు స్వగ్రామానికి మోటార్ సైకిల్‌పై తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో అరవింద స్కూల్ నుంచి విశ్వేశ్వర థియే టర్, రాధాకృష్ణ థియేటర్, తూర్పువీధి మీదుగా కమలా వెడ్డింగ్ మాల్ వద్దకు వెళ్లేసరికి వారి వెంట తెచ్చుకున్న నగదు, బంగారు ఆభరణాల సంచి పోయినట్లు గుర్తించి వెంటనే పట్టణ పోలీసలకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు అన్నిచోట్ల బుధవారం రాత్రి వెదికారు. అయినా నగదు, ఆభరణాల జాడ దొరకలేదు. దీంతో పోలీసులు గురువారం ఉదయం వాగ్దేవి జూనియర్ కాలేజీ వద్ద ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు. మోటా ర్ సైకిల్‌పై వెళ్తున్న కాశిరెడ్డి దంపతుల బ్యాగు కాలేజీకి సమీపంలోనే పడిపోయింది. అటుగా వెళ్తున్న తూర్పువీధికి చెందిన ఓ మహిళ ఆ బ్యాగును తీసుకుంది. పోలీసులు సదరు మహిళను గుర్తించి ఇంటికి వెళ్లి బ్యాగును స్వాధీనం చేసుకున్నారు. అందులో వున్న నగదు, బంగారు ఆభరణాలను గురు వారం సాయంత్రం బాధితులు వెన్నా కాశిరెడ్డి దంపతులకు అందించారు. ఈ సందర్బంగా సీసీ కెమెరాల ద్వారా పోయిన సొత్తు దొరికేందుకు సాయపడిన వాగ్దేవి కాలేజీ అధినేత గొలమారి పవన్‌ను అభినందించారు.

## ఘనంగా పైడిచింతపాడులో హెూలీ పండుగ సంబరాలు



**దెందులూరు మార్చి 14 నవభూమి** :హెూలీ పండుగ సంబరాలు అంగరంగ వైభవంగా జరిగాయి. తెలుగుదేశం పార్టీ దెందులూరు నియోజకవర్గ మహిళా నాయ కురాలు. పైడిచింతపాడు గ్రామానికి చెందిన టిడిపి మహిళా నాయ కురాలు కొల్లేరు ప్రజా సంక్షేమ సమితి చైర్పర్సన్ ముంగర ఉమాదేవి ఆధ్వర్యంలో హెూలీ పండుగ సందర్భంగా యువత . చిన్నారులు గ్రామస్తులు రంగు లు చిమ్ముతూ పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా ముంగర ఉమాదేవి మాట్లాడుతూ హెూలీ అనేది కుల.మత. వర్గ పార్టీలు అనే భేదం లేకుండా అందరూ ఎంతో ఆనందంగా జరుపుకుంటారనిచిన్న పెద్ద తేడా లేకుండా అందరూ ఆనందంగా జరుపుకుంటారనిసుఖం... దుఖం... సంతోషం, విచారం అన్ని కలిసిన రంగులే ఈ హెూలీ..రాగ ద్వేషాలకు అతీతంగా అందరినీ చేర్చే ఈ హెూలీ అందరికి శుభం కలగాలని అందరికీ మంచి జరగాలని కోరుకుంటున్నట్లు కొల్లేరు ప్రజా సంక్షేమ సమితి చైర్పర్సన్ ముంగర ఉమాదేవి అన్నారు.

## దెందులూరు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్‌ను పరామర్శించిన దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని



**దెందులూరు మార్చి 14 నవభూమి** :ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైన దెందులూరు మండలం సోమవరప్పాడు గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నేత దెందులూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాగంటి సురేంద్ర చౌదరి కి ఇటీవల రోడ్డు ప్రమాదం జరిగిన నేపథ్యంలో ఏలూరులో సిరి హాస్పిటల్ లో వైద్యం పొందుతున్నారు వారిని దెందులూరు శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ను పరామర్శించిన దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పరామర్శించారు.

## పెరుగుగూడెంలో శ్రీ వెంకట సత్యసాయి ఫిల్లింగ్ స్టేషన్ ప్రారంభించిన ఎమ్మెల్యే చింతమనేని

### ఎమ్మెల్యే తనయుడు ప్రేమ్ బాబు



**దెందులూరు మార్చి 14 నవభూమి** :గ్రామీణ ప్రాంతాల్లో రైతులు వాహనదారులు ఇబ్బందులు పడకుండా డీజిల్ .పెట్రోల్ బంకులను దగ్గర్లో అందుబాటులో ఏర్పాటు చేయడం అభినందనీయమని దెందులూరు శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్. ఎమ్మెల్యే తనయుడు చింతమనేని ప్రేమ్ బాబు అన్నారు . శుక్రవారం దెందులూరు మండలం పెరుగు గూడెం గ్రామం లో పెరుగుగూడెం గ్రామ మాజీ సర్పంచ్ యలమర్తి శీను బాబు లతో కలిసి పెరుగుగూడెం గ్రామానికి చెందిన శ్రీ వెంకట సత్య సాయి ఫిల్లింగ్ స్టేషన్ (పెట్రోల్ బంక్) అధినేత యలమర్తి నాగేంద్ర కుమార్. శ్రీమతి మౌనిక దంపతులు నూతనంగా ఏర్పాటుచేసిన పెట్రోల్ బంకును దెందులూరు శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్. ఎమ్మెల్యే తనయుడు చింతమనేని ప్రేమ్ కుమార్. పెరుగు గూడెం గ్రామ మాజీ సర్పంచ్ యలమర్తి శీను వాసరావు. ఇండియన్ పెట్రోల్ బంక్ సేల్స్ మేనేజర్ కే సంజీవి. లతో కలిసి పెట్రోల్ బంకును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు దెందులూరు మండలం టిడిపి అధ్యక్షులు మాగంటి నారాయణా ప్రసాద్ (మిల్లు బాబు). తెలుగు యువత అధ్యక్షులు మోతుకూరి నాని బాబు. పెరుగు గూడెం గ్రామ టిడిపి అధ్యక్షులు పావులూరి దశరధరామయ్య. చల్ల చింతలపూడి గ్రామ మాజీ సర్పంచ్ ముమ్మడి మోహనరావు.తెలుగుదేశం పార్టీ మండల పార్టీ కార్యదర్శి నాగన్న బోయిన సత్యనారాయణ. లతోపాటు పలువురు టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో పెరుగు గూడెం గ్రామ సర్పంచ్ యలమర్తి రామకృష్ణ. యలమర్తి రాంబాబు. పెరుగు గూడెం గ్రామస్తులు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు

## మందపల్లి దేవస్థానం వద్ద మరుగుదొడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే సత్యానందరావు

**కొత్తపేట నవభూమి**:కొత్తపేట మండల మందపల్లి (శనేశ్వర) స్వామి వారి దేవస్థానం వద్ద భక్తుల సౌకర్యార్థం 24 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మిస్తున్న మరగుదొడ్లకు స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యానందరావు శంకుస్థాపన చేశారు.ఎనిమిది యూనిట్ల మరుగుదొడ్లను నిర్మించి త్వరలోనే భక్తులకు అందుబాటులోకి తీసుకురానున్నట్లుఎమ్మెల్యే తెలిపారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# కొల్లేటి పెద్దింట్లమ్మకు 14వ రోజు ప్రత్యేక పూలతో అలంకరణ

◆ పెద్దింట్లమ్మ ఆలయంలో తెప్పోత్సవం ◆ అత్యంత కనుల పండుగగా పెద్దిల్లమ్మ తల్లి ఆలయ ఆవరణలో సాంస్కృతిక కార్యక్రమాలు





**దెందులూరు మార్చి14 నవభూమి** :కొల్లేటికోటలోని పెద్దింట్లమ్మ తల్లి ఆలయంలో గత 14 రోజులుగా అమ్మవారి జాతర ఉత్సవాలు సందర్భంగా తెప్పోత్సవం అత్యంత అంగరంగ వైభవంగా కనుల పండుగ పలు సాంస్కృతి కార్యక్రమాలతో వేలాదిమంది భక్తులతో కొనసాగుతున్నాయి.కొల్లేటి లంక గ్రామాలను కాపాడుతున్న గ్రామ దేవత కైకలూరు మండలం కొల్లేటికోటలో వెలసిన చల్లని తల్లిగా సంతాన లక్ష్మిగా పేరుపొందిన పెద్దింట్లమ్మగా కొంగు బంగారంగా, కోరికలు తీర్చే కల్పవల్లిగా కొల్లేటికోటలో వేంచేసి ఉన్న శ్రీ పెద్దింటి అమ్మవారి జాతర మహెూత్సవాలు భక్తుల సందడితో అంబరాన్ని అంటాయి. 14 వ రోజు అమ్మవారిని వేలాది మంది భక్తులు మధ్య తెప్పోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు భక్తులు పెద్ద ఎత్తున పెద్దింట్లమ్మ తల్లిని దర్శించుకున్నారు. పెద్దింట్లమ్మ తల్లి ఆలయ కార్య నిర్వహణ అధికారి (ఈవో)కూచిపూడి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉదయం 5 గంటల నుండి శ్రీ అమ్మవారికి నూతన వస్త్రాలంకరణ మరియు పలు రకాల పూలతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. మావరణ పూజ, షష్ఠావరణ కళా శార్చన, పుష్పాలంకరణ ధూప సేవ,బాల భోగం, నీరాజనం, మంత్రపుష్పము అనంతరం ఉచిత ప్రసాదం వితరణ మంత్ర పుష్పములు వంటి పూజా కార్యక్రమాలు ఆలయ అర్చకులు అమ్మవారికి నిర్వహించారు. ఆలయ కమిటీ వారు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగు జాగ్రత్తలను పెద్దింట్లలమ్మ ఆలయ కమిటీ సభ్యులతో పాటు ఆలయ ఈవో కూచిపూడి శ్రీనివాస్ అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. భక్తులకు త్రాగునీరు ఇబ్బందులు లేకుండా అమ్మవారి దర్శనం అయ్యే విధంగా అన్ని జాగ్రత్తలు ఏర్పాటు చేసింది పెద్దింట్లమ్మ ఆలయ కమిటీ ఈవో కూచిపూడి శ్రీనివాసరావు దగ్గరుండి ఉత్సవ పనులను పర్యవేక్షిస్తున్నారు. వేలాదిమంది ఈ అమ్మవారి తెప్పోత్సవం కార్యక్రమంలో పాల్గొన్నారు.

# కొవ్వలి పేదలు, దళితుల భూములకు పట్టాలివ్వాలి

◆ భూస్వాములు ఆక్రమించుకున్న అసైన్మెంట్ భూములు పేదలకు పంచాలి




**దెందులూరు, మార్చి 14 నవభూమి** :కొవ్వలి గ్రామంలో దళితులు,పేదలు సాగుచేసుకుంటున్న భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలని, సాగుకు అవకాశం కల్పించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఏ రవి డిమాండ్ చేశారు. శుక్రవారం నాడు సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక సమస్యలపై ప్రజా చైతన్యాత్రను కొవ్వల్లో ప్రారంభించారు. ఈ స్థానిక సమస్యలపై ప్రజా చైతన్య యాత్రకు దళానాయకుడుగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి రామకృష్ణ వ్యవహరించగా జిల్లా నాయకులు కె. లెనిన్ మండల నాయకులు డి.నాగేంద్ర, పి.ఆనందరావు సభ్యులుగా ఉన్నారు.లిఈ సందర్భంగా ఏ రవి మాట్లాడుతూలి కొవ్వలి గ్రామంలో 1963 నుండి బంజర భూమిగా ఉన్న ఆర్ఎస్ నెంబర్ 131/4 లో 304 ఎకరాల ప్రభుత్వభూమిని అప్పటి ప్రభుత్వాలు 101ఎకరాలు వ్యవసాయక్షేత్రాలకు, 25 ఎకరాలు ఫిషరీస్ డిపార్ట్మెంట్ కు మిగిలిన భూమి భూములేని దళితులు,పేదలు సాగుకు అవకాశం కల్పించారు. కానీ గత ఆరునెలల నుండి కొవ్వలి గ్రామానికి చెందిన వెలమాటి సౌందర్య గ్రామ దీపికా ట్రస్ట్ నాయకురాలు కోర్టులో కేసు వేసి పేదలను, దళితులను ఇబ్బందులకు గురిచేస్తుందని విమర్శించారు. వరి వ్యవసాయం చేయటం వల్ల కాలుష్యం ఏర్పడుతుందని వింత వాదనతో కోర్టుకెళ్లడాన్ని రవి తీవ్రంగా దుయ్యబట్టారు ప్రభుత్వ చట్టాలను అమలు చేయాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం సిగ్గుచేటు అన్నారు. ప్రభుత్వ భూములు ఉంటే ప్రభుత్వం దగ్గర ఉండాలి లేకపోతే పేదల దగ్గర ఉండాలి అని చట్టాలు చెబుతున్న ఈ చట్టాలను అమలు చేయాలిసిన రెవెన్యూ శాఖ అధికారులు తాత్సారం చేస్తూ దళితులను, పేదలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. కొవ్వలి పేదలు రెవెన్యూ శాఖకు మరియు పంచాయతీ శాఖకు గత 50 ఏళ్లకు పైగా పన్ను కట్టి ఈ భూములు సాగు చేస్తుంటే సాగు చేస్తున్న పేదలపై కక్ష సాధింపు చర్యలు వెలమాటి సౌందర్య చేయడం దుర్మార్గం అన్నారు. దళితులు పేదలు సెంటు భూమి కలిగి ఉండడాన్ని సహించలేక అగ్రవర్ణ దురహంకారంతో కోర్టుకెళ్లిందని విమర్శించారు అక్రమంగా వెలమాటి సౌందర్య పేదలకు చెందిన అసైన్మెంట్ భూములను ఒకపక్క సాగు చేస్తూ మరోపక్క పేదలు సాగు చేస్తున్న భూములపై కోర్టులో కేసు వేయడం సిగ్గుచేటన్నారు. చట్టాన్ని అమలు చేయాల్సిన అధికారులు దీని పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోపాటు భూస్వాములు ఇచ్చే లంచాల మింగే పేదలకు అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు కొండనాలకి మందేస్తూ ఉండనాలిక పోయిందన్నట్లు చివరికి బుడమేరు పొంగడానికి విజయవాడ ముంపుకు కొవ్వలి దళితులు భూమి సాగు చేయటమేనని కారణం గా చెప్పడాన్నీ హాస్యాస్పదంగా ఉందన్నారు కొవ్వలి పేదలు రెక్కాడితేనే డొక్కాడని కుటుంబాలు నేడు వ్యవసాయం చేయకపోవడంతో వ్యవసాయ పనులు లేకపోవడంతో నానా అవస్థలు పడుతున్నారని తెలిపారు ఈ యాత్ర సందర్భంగా కొవ్వలి గ్రామంలో మంచినీటి చెరువు సమస్య పరిష్కారం చేయాలని చెరువులో ఉన్న పూడిక తీసి మంచినీటి సరఫరాకు ప్రభుత్వం పూనుకోవాలని కోరారు పేదల యొక్క భూములను చేపల చెరువులకు ట్యాంకులుగా ఉపయోగించుకోవడానికి భూస్వాములు చూస్తున్నారని విమర్శించారు ఇప్పటికే ఈ భూములు కోసం పేదలు నారుమల్లు పోసి కుటుంబానికి రెండు వేల నుంచి 3000 నష్టం పోయారని తెలిపారు కాబట్టి ప్రభుత్వం ఈ భూములను పేదలకు పని చెయ్ వాళ్ళకి హక్కు పత్రాలు కల్పించి పట్టాలు ఇచ్చే సాగు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు అనంతరం రామకృష్ణ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో వందలాది ఎకరాల భూములు అన్యాక్రాంతమయ్యాయని ఆ భూములపై సమగ్ర సర్వే రెవెన్యూ పంచాయతీ శాఖ అధికారులు చేసి బట్టపైలు చేయాలని కోరారు అసైన్మెంట్ భూములను గ్రామ సచివాలయాల్లో బహిర్గత పరచాలని ఆక్రమించుకున్న వారి పేర్లు బహిర్గతపరచాలని డిమాండ్ చేశారు రానున్న కాలంలో కొవ్వలి భూ సమస్యపై సిపిఎం పెద్ద ఎత్తున పోరాటానికి సన్నద్ధమవుతుందని పిలుపునిచ్చారు ఈ యాత్ర కొవ్వలిలో ప్రారంభమై దోసపాడు పోతునూరు తదితర గ్రామాల్లో పర్యటించింది ఈయాత్రలో పోతునూరు ఆటో కార్మికులతో వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు దోసపాడు దళితులు తమ భూమి,గ్రామ సమస్యలను వివరించారు సిపిఎం జిల్లా నాయకులు కె. లెనిన్ మండల నాయకులు ఆనందరావు, నాగేంద్ర కొవ్వలి గ్రామం నాయకులు వెంకట్రావు, రంగారావు, బుజ్జి, బాబు తదితరులు పాల్గొన్నారు.

# దద్దరిల్లిన తూర్పుగోదారి జిల్లా దళితసేనకార్యకర్తల సమావేశం

◆ దళిత సేన రాష్ట్ర మహాధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయండి దళిత సేన వ్యవస్థాపక అధ్యక్షులు జుజ్జువరపు రవి ప్రకాష్ పిలుపు



**దెందులూరు మార్చి 14 నవభూమి** :తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం సింగరాజుపాలెం గ్రామంలో జరిగిన తూర్పుగోదావరి జిల్లా దళిత సేన నాయకుల కార్యకర్తల సమావేశం నల్లజర్ల మండల దళిత సేన అధ్యక్షులు మిరియాల ఆశీర్వాదం (జాన్) అధ్యక్షతన జరిగిన సమావేశంలో దళిత సేన వ్యవస్థాపక అధ్యక్షులు జిజ్జువరపు రవి ప్రకాష్ మాట్లాడుతూ చలో ఏలూరు దళిత సేన రాష్ట్ర మహా ధర్నా కార్యక్రమాన్ని దీ 05-05-2025 తేదీ ఉదయం 10 గంటలకు ఏలూరు జిల్లా కలెక్టరేట్ వద్ద 1) రాష్ట్రంలోని వెనకబడిన వర్గాల సాగుదారులు కు సాగు పట్టాలు మంజూరు చేయాలని,2) రాష్ట్రంలోని డప్పు కళాకారులకు చర్మకారులు అర్హులైన వారికి పెన్షన్‌లను మంజూరు చేసి వారికి ప్రత్యేక హెల్త్ కార్డులను ఇవ్వాలని వీరికి లెదర్ ఇండస్ట్రీస్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ (లీడ్ క్యాప్) ద్వారా సబ్సిడీ రుణాలను మంజూరు చేయాలని లీడ్ క్యాప్ కురాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని లీడ్ క్యాప్ ను ప్రక్షాళన చేయాలని ,3) రాష్ట్రంలోని అట్రాసిటీ చట్టాన్ని పరిరక్షించాలని ఈ చట్టం కింద నమోదు అవుతున్న కేసులను సత్వరమే విచారణ వేగంతో చేసి బాధితులకు న్యాయం చేయాలని పైన తెలిపిన న్యాయమైన డిమాండ్లను పరిష్కరించుటకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చిత్తశుద్ధితో పరిష్కరించుటకు చూడాలని రవి ప్రకాష్ విజ్ఞప్తి చేశారు అదేవిధంగా పై అంశాలపై దళిత సేన రాష్ట్ర మహా ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయుటకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సాగుదారులు డప్పు కళాకారు, చర్మకారులు దళిత సేన కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని రవి ప్రకాష్ పిలుపునిచ్చారు,

ఈ సమావేశంలో ఏలూరు జిల్లా దళిత సేన వర్కింగ్ ప్రెసిడెంట్ శిఖ కోల్లు స్టాలిన్ మరియు తూర్పుగోదావరి జిల్లా దళిత సేన సలహాదారులు దొండపాటి మాణిక్యాలరావు సింగరాజుపాలెం గ్రామ అధ్యక్షులు పెదపాటి వెంకటేష్ ఉపాధ్యక్షులు మిరియాల విజయకుమార్ ఆవు పాడు గ్రామ అధ్యక్షులు దొండపాటి సువర్ణ రాజు ఉపాధ్యక్షులు ఇల్లందు ఏసు దళిత సేన కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న మహిళకు తనతో చదివిన విద్యార్థుల వితరణ



**అమలాపురం మార్చి 14. నవభూమి**:అంబేద్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట వద్ద గంగలకుర్రు గ్రామం . బుడిదవారిపేట కు చెందిన తరివెట్ల నాగ శుభశ్రీ అనే మహిళ కిడ్నీ వ్యాధితో బాధపడుతుంది. చికిత్స నిమిత్తం 10 లక్షలు రూపాయల వరకు ఖర్చు అవు తుందని వైద్యులు తెలిపారు. ఈ విషయం ఆమే తో చదువు కున్న విద్యార్థులు తెలుసుకుని అదే గ్రామంలోని గంగలకుర్రు హైస్కూల్‌లో 2006-2007 విద్యా సంవత్సరం బ్యాచ్‌కు చెందిన తోటి విద్యార్థులు అందరూ కలిసి శుక్రవారం రూ.21000 ఆమెకు ఆర్థిక సహాయం అందజేశారు. వీరిని ఆ గ్రామ స్తులంతా అభినందించారు.

## అన్నదాన ఆశ్రమాన్ని కూల్చటం హేయమైన చర్య





**మైలవరం-నవభూమి**:కడప జిల్లా బద్వేలులో పేదలకు అన్నదానం చేస్తున్న ఆశ్రమాన్ని కూల్చటం హేయమైన చర్యని ఏపీ రెడ్డి సంఘం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు బిక్క నరసింహారెడ్డి, రెడ్డి సంఘం ప్రధాన కార్యదర్శి గజ్జల వెంకటరెడ్డి, సహాయ కార్యదర్శి అన్నం సుబ్బారెడ్డిలు శు క్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అటవీ ప్రాంతం అనే కారణంతో నిత్య అన్నదాన ఆశ్రమాన్ని కూల్చివేయటం ఒక సామాజిక వర్గం నేపథ్యంలో జరిగిందని విమర్శించారు. అన్నదాన ఆశ్రమాన్ని కూల్చివేయటం ఖండిస్తున్నామన్నారు. సనాతన ధర్మాన్ని కాపాడు తామంటూ చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ లు అంటున్నారని అన్నదాన ఆశ్రమాలను కూల్చటమే సనాతన ధర్మమా అని ప్రశ్నించారు. రాజకీయాలకు, కులాలకు, మతాలకు అతీతంగా కాశిరెడ్డి నాయన ఆశ్రమాన్ని కాపాడుకుందాం నిత్య అన్నదానాన్ని కొనసాగిద్దాం అనే నినాదంతో ఈనెల 16వ తేదీన క్షేత్ర సందర్శన కార్యక్రమం చేపట్టామని వేలాదిగా తరలివచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## ఆవిర్భావ సభకు భారీగా జన శ్రేణులు

**అమలాపురం. మార్చి14.( నవభూమి ప్రతినిధి)** రాజోలు. గన్నవరం నియోజకవర్గా ల ఎమ్మెల్యే దేవ వరప్రసాద్. గిడ్డి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆయా నియోజకవర్గాల నుంచి పిఠాపురం చిత్రా డలో జరుగుతున్న జనసేన ఆవిర్భావ సభకు రాజోలు .మలికిపురం. మామిడికుదురు. సఖినేటిపల్లి. మండలాల నుంచి యువత భారీగా పార్టీ శ్రేణులు తరలి వెళ్లారు ఆయా మండలాలు ఆయా గ్రామాలలో పార్టీ స్థూపం వద్ద జనసేన పతాకాన్ని ఆవిష్కరించి తర్వాత అక్కడి నుంచి పలు వాహనాల్లో ర్యాలీగా చిత్రాడ పయనమయ్యారు పార్టీ పతాకాలతో జనసైనికులు మహిళలు ఉత్సాహము కేరింతలతో సందడి చేస్తూ కోలాహలంగా బయలుదేరారు. పి గన్నవరం. రాజోలు. నియోజకవర్గాల జనసేన అధ్యక్షు లు గ్రామ శాఖ అధ్యక్షులు పార్టీ శ్రేణులు. పాల్గొన్నారు.







# కొత్తపేట.. నీటికి కటకట

**కనిగిరి-నవభూమి:** కనిగిరి పట్టణంలో సంపన్నుల పేట నీటికోసం కటకటలాడుతుంది. భూగర్భ జలమట్టం పడిపోయి బోర్లలో నీరురావడంలేదు. దీంతో కొత్తపేట వాసులకు మున్సిపాల్టి సరఫరాచేసే నీరే దిక్కయింది. అదికూడా ఐదురోజులకొకమారు ట్యాంకర్ ద్వారా సరఫరాచేస్తున్నారు. ఈనీరు సరిపడక స్థానికులు పడరానిపాట్లు పడుతున్నారు. గతపాలకులు ఇంటింటికి నీటి సరఫరా చేస్తామని ప్రచారాలు చేసి పట్టించుకోలేదని కొత్తపేట ప్రజలు విమర్శిస్తున్నారు. అరకొరగా పనిచేసే బోరు మోటర్‌ల నుంచి కేవలం పది బిందెలు కంటే వచ్చే పరిస్థితి లేకుండా పోయింది. గతేడాది చివరి మాసాల్లో కురిసిన వర్షాలకు నాగులచెరువుకు నీరొచ్చి భూగర్భ జలమట్టం పెరిగి బోర్లు మళ్ళీ వాడుకలోకి వస్తాయని భావించిన ప్రజలకు నీటి కష్టాలు తప్పటం లేదు. ప్రతిఇంటి ముందు పెద్ద, పెద్ద ట్యాంకులు, పీపాలు దర్శనమిస్తూ ప్రజలు పడుతున్న అవస్థలకు సాక్ష్యంలా నిలిచాయి.కనిగిరి పట్టణంలోని కొత్త పేటలో బహుళ అంతస్థులు వెలిశాయి. ఒక్కో అంతస్థుకు సరాసరిన రోజుకు వెయ్యి లీటర్లు వినియోగించుకునే పరిస్థితి. కొత్తపేట ప్రాంతంలో గృహ యజమానుల కంటే ఎక్కువ మంది బయటి ప్రాంతాల నుంచి వచ్చి అద్దెలకు నివసిస్తున్నవారే ఎక్కువగా ఉన్నారు. కొత్తపేటలో దాదాపు మూడువేల మంది జనాభా ఉన్నారు. 1800 వందల కుటుంబాలకు పైగా నివసిస్తున్నారు. రెండు సచివా లయాల పరిధిలో విస్తీర్ణంలో కొత్తపేట ఏర్పాటయింది. అత్యధిక జనాభా కల్గిన ప్రాంతంగా కొత్తపేట పేరొందింది. కాశినాయన గుడి దాటి నాగులచెరువు అలుగు వరకు ఇళ్ళు విస్తరించాయి. ఈ ప్రాంతం నుంచి ఏడాదికి సగటున దాదాపు రూ.20 లక్షల వరకు ఇంటి పన్నుల రూపంలో మున్సిపాల్టీకి చెల్లిస్తున్నారు.

# క్రిటికల్ కేర్ యూనిట్‌ను జులై 30వ తేదీ ప్రజలకు అంకితం చేస్తాం

### ఈ క్రిటికల్ కేర్ యూనిట్ నెల్లూరు జిల్లాకే తలమానికం

### నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి





**నెల్లూరు,మార్చి 14,(నవభూమి)::**నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ ప్రధాన వైద్యశాల లో 24 కోట్ల రూపాయలతో నిర్మిస్తున్న 50 పడకల అత్యంత ఆధునిక వసతులతో ఏర్పాటు చేస్తున్న క్రిటికల్ కేర్ యూనిట్ ప్రజలకు మేలు చేస్తుంది అని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు.24 కోట్ల రూపాయలతో నిర్మిస్తున్న 50 పడకల క్రిటికల్ కేర్ యూనిట్ పనులను ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి .పరిశీలించారు.ఈ సందర్భంగా రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ ఈ క్రిటికల్ కేర్ యూనిట్ నెల్లూరు జిల్లాకే తలమానికం అని, అత్యంత ఆధునిక వసతులతో ఏర్పాటుచేస్తున్న క్రిటికల్ కేర్ యూనిట్ ప్రజలకు ఎంతో మేలు చేస్తుంది అన్నారు.జులై 30వ తేదీ లోపల దీనిని పూర్తిచేసి,వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్,జిల్లా మంత్రులు పొంగూరు నారాయణ,ఆనం రామనారాయణ రెడ్డి,నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి చేతుల మీదుగా దీనిని ఘనంగా ప్రారంభించి ప్రజలకు అంకితం చేస్తామన్నారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేస్తున్న కృషికి ప్రజలందరి ఆశీస్సులు ఉండాలన్నారు.ఈ కార్యక్రమంలో వైద్యులు, ప్రభుత్వ వైద్యశాల కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి జూడో పోటీలకు జెడ్పీ పాఠశాలవిద్యార్థుల ఎంపిక



**పెద్దకడబూరు మార్చి 14 (నవభూమి) :** పెద్దకడబూరు మండల పరిధిలోని కల్లుకుంట గ్రామ జెడ్పీ పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి జూడో పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు ఉసేనప్ప శుక్రవారం తెలిపారు.పాఠశాలలో చదువుతున్న బాబు,చాంద్ బాషా,గంగాధర్,శరత్,సతీష్ ఇటీవల ఆలూరులో జరిగిన జిల్లాస్థాయి జూడో పోటీల్లో ప్రతిభ చాటి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు వెల్లడించారు.విద్యార్థులను హెచ్‌ఎంతోపాటు వ్యాయామ ఉపాధ్యాయులు దుబ్బన్న అభినందించారు.అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులు గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.

# దొడ్డి బెళగల్ గ్రామంలో సిసి రోడ్లు డ్రైనేజ్ కాలువలు ఏర్పాటు చేయాలి

### సిపిఎం డిమాండ్

**కోసిగి.మార్చి14 (నవభూమి):**కోసిగి మండలం దొడ్డి బెళగల్ గ్రామంలో సచివాలయం ఏరియా సౌల్ గిరి నందు సిసి రోడ్లు డ్రైనేజీ కాలువలు నిర్మించాలని సిపిఎం మండల నాయకులు రాముడు ,వీరేశు,లు డిమాండ్ చేశారు. శుక్రవారం దొడ్డిబెళగల్ గ్రామంలో సిపిఎం ప్రజా చైతన్య యాత్ర కార్యక్రమం నిర్వహించడం జరిగింది. సందర్భంగా గ్రామ ప్రజలు గ్రామంలో సీసీ రోడ్లు డ్రైనేజ్ కాలువ లేకపోవడం వల్ల వర్షాకాలంలో వర్షపునీరు గ్రామంలో నీరు కొండనీరు ఇండ్లలోకి చేరి చాలా ఇబ్బందులకు గురవుతున్నామని దొడ్డి గ్రామ ప్రజలు ప్రజా చైతన్య యాత్ర దృష్టికి తీసుకు వచ్చినట్లు సిపిఎం పార్టీ నాయకులు రాముడు వీరేష్ తెలిపారు. ఈ ఈ సమస్యను చాలాసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఫలితం లేకపోయిందని గ్రామ ప్రజలు సిపిఎం నాయకులు దృష్టికి తీసుకువచ్చినట్లు వారు తెలిపారు. అంతేకాకుండా వితంతువులు వృద్ధులు వికలాంగులు పెన్షన్ కోసం సంవత్సరాలుగా దరఖాస్తు చేసుకున్న పెన్షన్ కు నోచుకోవడం లేదని విద్యుత్ బిల్లులు పెంచి ప్రజల పైన భారం మోపిందని వారు విమర్శించారు. అన్నదాత సుఖీభవ తల్లికి వందనం సూపర్ సిక్స్ పథకాలు వెంటనే అమలు చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు హనుమంతు నాగేంద్ర వీరేష్ తాయన్న గ్రామ ప్రజలు తదితరులు పాల్గొనడం జరిగింది.



# నా అజెండా అనంతపురం అభివృద్ధి మాత్రమే : అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి

- ఎవరెవరో ఏవేవో మాట్లాడుతున్నారు.. నేను అవన్నీ పట్టించుకోను
- 40ఏళ్ల నుంచి వారు చేయలేని పనులు నేను చేసి చూపిస్తా
- అనంతపురం నగరాన్ని రాష్ట్రంలోనే నెంబర్ వన్‌గా మారుస్తా
- అర్బన్ కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే



**అనంత పురం మార్చి 14 నవభూమి :**శిలాఫలకాల విషయంలో ఓ నేత చేసిన వ్యాఖ్యలకు.. అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. ఎవరెవరో ఏవేవో మాట్లాడు తున్నారని.. నేను అవన్నీ పట్టించుకోనని.. నా అజెండా అనంతపురం అర్బన్ నియోజకవర్గ అభివృద్ధి మాత్రమేనని ఆయన స్పష్టం చేశారు. 40 ఏళ్ల నుంచి వారు చేయలేని పనులు నేను చేసి చూపిస్తానంటూ దగ్గుపాటి వ్యాఖ్యానించారు. అనంతపురం అర్బన్ టిడిపి కార్యాలయంలో ఆయన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. నియోజకవర్గానికి చెందిన 7మందికి 9లక్షల 50వేల రూపాయల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేశారు. ఇప్పటివరకు 78 లక్షల రూపాయలు సీఎంఆర్ కింద సాయం చేసినట్లు ఎమ్మెల్యే దగ్గుపాటి వివరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తామిచ్చిన హామీల్లో మొదటి ఐదు సంతకాలు కీలకమైన వాటిపై చేసినట్లు వివరించారు. పింఛన్ల పెంపు, 16 వేలకు పైగా వరకు డీఎస్సీ పోస్టులు, అన్న క్యాంటీన్లు, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు వంటివి ఉన్నాయని చెప్పారు. పట్టణాభివృద్ధికి, గ్రామీణాభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. అసెంబ్లీలో తనకు రెండుసార్లు మాట్లాడే అవకాశం వచ్చిందని.. నగరంలో ప్రధాన సమస్యలుగా ఉన్న డంపింగ్ యార్డ్, ప్రొడక్షన్ వాల్స్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ గురించి మాట్లాడినట్లు వివరించారు. అక్టోబర్ రెండు లోపు డంపింగ్ యార్డ్ ను క్లియర్ చేసి చూపిస్తామన్నారు. 88 కోట్లతో మరువవంక, నడిమివంక ప్రొటెక్షన్ పనులు త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కూడా త్వరలో మంజూరవుతుందని.. ఆ పనులు కూడా ప్రారంభిస్తామన్నారు. గత 15ఏళ్లలో జరగని అభివృద్ధిని ఈ ఏడు నెలల్లోనే చేసి చూపిస్తున్నామన్నారు. రుద్రంపేట రోడ్డు పదేళ్ల నుంచి పెండింగ్ లో ఉందని.. తాను వచ్చిన ఆరు నెలల్లోనే రోడ్డు వేసినట్లు చెప్పారు. 40 కోట్లతో నగరపాలక సంస్థ పరిధిలో అభివృద్ధి పనులు చేస్తున్నట్లు వివరించారు. అనంతపురం నగరాన్ని గతంలో పాలించిన నాయకులు 40 ఏళ్లుగా చేయని వాటిని నేను చేసి చూపిస్తానన్నారు. అనంతపురం నగరాన్ని రాష్ట్రంలో నెంబర్ వన్ గా మార్చడమే తన ధ్యేయమని ఆయన స్పష్టం చేశారు. నగరంలో మున్సిపల్ స్థలాలు, ఆక్రమణలపై చర్యలు తీసుకుంటామని.. ఆక్రమించిన స్థలాలను తిరిగి స్వాధీనం చేసుకొని పార్కులు, కమ్యూనిటీ హాల్స్, పాఠశాలలు నిర్మిస్తామని ఎమ్మెల్యే దగ్గుబాటి తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నగర ప్రధాన కార్యదర్శి ముక్తియార్, మైనార్టీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఫిరోజ్ అహ్మద్, మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి సైఫుద్దిన్, క్లస్టర్ ఇంచార్జ్ గోపాల్ గౌడ్, క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఈటె స్వామి దాస్, మాజీ కార్పొరేటర్ మల్లెల దుర్గేష్, టీడీపి నాయకులు డాక్టర్ హరి, మహిళా నాయకురాలు శ్రీదేవి, శోభ తదితరులు పాల్గొన్నారు.

# రాప్తాడులో నియంత పాలన సాగుతోంది

- ఎస్పైలు సిఐలు కూటమి ప్రభుత్వానికి కొమ్ము కాస్తున్నారు
- ఎస్పైలు సిఐలు పరిటాల సునీత చెప్పినట్లు నడుచుకుంటున్నారు
- లైనింగ్ పనులు చేస్తే చూస్తూ ఊరుకునేది లేదు
- హంద్రీ నీవా లైనింగ్‌పనులు జరిగితే లక్షల ఎకరాలు బీల్లుగా మారే ప్రమాదం ఉంది
- నియోజకవర్గ రైతుల సమస్యలపై రాజీ పడను. జైలుకు వెళ్లేందుకు కూడా సిద్ధం
- వైసిపి నేత రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి



**అనంతపురం మార్చి 14 నవభూమి :**రాప్తాడు నియోజకవర్గంలో నియంత పాలన సాగుతుందని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత శ్రీరామ్ చెప్పిన విధంగా ఎస్పైలు సిఐ లుపని చేస్తున్నారని చట్టాన్ని చేతిలోకి తీసుకునేందుకు కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని గత ఐదు సంవత్సరాలుగా ఎమ్మెల్యేగా తాను పనిచేశానని రాప్తాడు నియోజకవర్గంలో ఆత్మకూరు మండలంలో బాలన్న అనే వ్యక్తిపై తీవ్రంగా గాయపరిస్తే అతనికి పరామర్శించడానికి వెళ్తే పోలీసు యంత్రాంగం అడ్డుకోవడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు.రాప్తాడులో పరిటాల సునీత పరిటాల శ్రీరామ్ ఒక డిక్టేటర్ల వ్యవహరిస్తున్నారని వైసీపీ నేత రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోడుదుర్తి ప్రకాశ్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. శుక్రవారం అనంతపురం నగర శివారులోని తన నివాసంలో కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. రాప్తాడు నియోజకవర్గంలో ప్రజలు పడుతున్న ఇబ్బందుల గురించి మాట్లాడడానికి, బాధితులనుపరామర్శించడానికి వెళ్లేందుకు గ్రామాల పర్యటనకు కూడా పోలీసులు అనుమతులు ఇచ్చే పరిస్థితులు లేవు. దేశ పౌరుడిగా రాజ్యాంగం నాకు కల్పించిన హక్కులను కాపాడడానికి చట్టబద్దత కల్గిన పోలీస్ వ్యవస్థ చర్యలు తీసుకోవాలి. పోలీసులు తక్కువ ఉన్నారు...24 గంటల ముందు మాకు సమాచారం ఇవ్వాలి...ఎస్ఐ రిలీవ్ అయ్యాడు...సీఐ లీవ్‌లో ఉన్నారంటూ ఉమ్మడి జిల్లా పోలీసు యంత్రాంగం కుంటి సాకులుచెబుతోంది.రాప్తాడుకు ప్రత్యేక రాజ్యాంగం రాస్తున్న పరిటాల సునీత. ఖాకీ చొక్కాల వెనుక ఉండి నడిపిస్తున్నారు. పోలేపల్లి గ్రామంలోలక్ష్మీనరసింహస్వామి ఆలయ వార్షికోత్సవానికి రావాలని గ్రామస్తులు ఇంటికి వచ్చి కోరడం, అదే గ్రామానికి చెందిన తమ పార్టీ కార్యకర్త తలారి రాజు ఇటీవల అనుమానస్పదంగా మృతి చెందాడు. వారి కుటుంబాన్ని పరామర్శించి, నరసింహస్వామి ఆలయ వార్షికోత్సవంలో పాల్గొనేందుకు వెళ్తుంటే దాదులూరు గ్రామం వద్ద డీఎస్పి, సిఐ, ఎస్ఐలు వచ్చి అడ్డుకుని బందోబస్తు ఇవ్వలేమని పర్యటన వాయిదా వేసుకోవాలంటూ చెప్పారు. ఆ గ్రామంలో ఏమైనా యుద్ధవాతావరణం ఉందా?. గ్రామస్తులందరూ పండుగ చేసుకుంటున్నారు. అలాంటి చోటుకు వెళ్లనీయకుండా గంటకు పైగా హైవేపై అడ్డుకుని వెనక్కు పంపారు. పైగా ఎంఎల్ఏ పరిటాల సునీత ఆ గ్రామానికి వస్తున్నారని చెప్పారు. పోనీ సిద్ధరాంపురం గ్రామంలో తమ పార్టీ కార్యకర్త కురుబ బాలన్ననుపరామర్శించేందుకు అనుమతి ఇచ్చిన పోలీసులు కాసేపటికే అక్కడికి కూడా పరిటాల సునీత వస్తున్నారు. వెళ్లేందుకు ఇబ్బందిగా ఉంటుందని అనుమతి నిరాకరించారు. ఖాకీ బట్టలు వేసుకున్న పోలీసులు ప్రజల కోసం పని చేస్తున్నారా? లేదంటే పరిటాల సునీత కోసం పని చేస్తున్నారా?. రాజ్యాంగబద్ధంగా లా అండ్ ఆర్డర్ కోసం పని చేస్తున్నారా లేదంటే తెలుగుదేశం పార్టీని బలపరిచేందుకు పని చేస్తున్నారా?. రామగిరి ఎస్ఐగా పని చేస్తున్న సుధాకర్‌యాదవ్ పోలేపల్లికి వస్తే పెద్దపెద్ద గొడవలు అవుతాయనిచెబుతున్నారు...పోలీసులు ఉండేది ఎందుకు?. ఆయన టిడిపి ఏజెంటుగా పని చేస్తున్నారా?. ఊరిలో లేని సమస్యను సృష్టిస్తూ పోలీసు వ్యవస్థను తప్పుదారి పట్టిస్తున్నాడు. వాస్తవానికి ఆ గ్రామంలో టిడిపి వాళ్లకు లేని ఉద్దేశాలను ఎస్ఐ కల్పిస్తూ డిఎస్పిని తప్పుదారి పట్టిస్తున్నాడు.ఆత్మకూరు మండలం సిద్ధరాంపురంలో కులాలకు అతీతంగా హంద్రీ నీవా లైనింగ్ పనులు జరగకుండా అడ్డుకోవాలని నిర్ణయించుకున్నారు. కులాలు,వర్గాలు, పార్టీలను రెచ్చగొట్టి లైనింగ్ పనులు చేయించాలని పరిటాల సునీత కుట్ర పన్నారు.ఇటుకులపల్లి సిఐ, రాప్తాడు సిఐ, రామగిరి ఎస్ఐ...మీ పద్దతులు మార్చుకుంటే బాగుంటుంది. లైనింగ్‌పనులు జరిగితే లక్షల ఎకరాలు బీల్లుగా మారే ప్రమాదం ఉంది. దీనిపై రైతులను చైతన్యం చేయాల్సిన బాధ్యత నాపై ఉంది. ఐదేళ్లు ఎంఎల్ఏగా పని చేశా. మొన్న ఎన్నికల్లో 95 వేల ఓట్లు వచ్చాయి. నా రైతులు, ప్రజలను కాపాడుకోవాల్సిన బాధ్యత నా పైనా ఉంటుంది. హంద్రీనీవా కింద తనకు భూములున్నాయి. లైనింగ్ పనులు జరిగితే నేను వ్యక్తిగతంగా నష్టపోతా. చంద్రబాబు, పరిటాల సునీత చరిత్రలో కలిసిపోతారు. ఎవరూ కంకరు ఇవ్వకూడదు. టిప్పరు డ్రైవర్లు ఎవరూ వెళ్లకూడదు. రైతుల భూములు క్యాంపులకు ఇవ్వకూడదు. ఎక్కడికక్కడ అడ్డుకోవాలి. ప్రతి రైతూ ఒక సైనికుడిగా మారుతారు. గతంలో ఐదేళ్లు రామగిరి మండలంలోకి నన్ను రానీవ్వని ఫలితం తోపుదుర్తి, గొందిరెడ్డిపల్లి, మరూరు, చెర్లోపల్లి గ్రామాల్లో పరిటాల సునీత చవి చూసింది. అలాంటి పరిస్థితులు మళ్లీ తెచ్చుకోవద్దు. గ్రామాలను ప్రశాంతంగా ఉండనీయండి. నియోజకవర్గ రైతుల సమస్యలపై రాజీ పడను. జైలుకు వెళ్లేందుకు కూడా సిద్ధం. సిద్ధరాంపురం గ్రామానికి చెందిన బాధితుడు కురుబ బాలన్నను పరామర్శించడానికి వెళ్లనీయకపోవడంతో ఇక్కడికే బాధితుడిని పిలిపించి మీడియాకు చూపించారు.

### బెటర్ లైఫ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో

# విద్యార్థులకు పెన్నులు, ఫ్యాడ్లు పంపిణీ

**బాపట్ల - నవభూమి:** బాపట్ల పట్టణం అంబేద్కర్ భవన్‌లో బెటర్ లైఫ్ చారిటబుల్ ట్రస్ట్ ప్రారంభోత్సవం సందర్భంగా పట్టణంలోని బాల సదనం, శారా ఫెయిత్ ఫౌండేషన్ విద్యార్థినీ,విద్యార్థులకి పెన్నులు, ఫ్యాడ్లు, బెటర్ లైఫ్ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ ప్రెసిడెంట్ సలగల ఎలీషా బాబు పంపిణీ చేశారు.ఫౌండర్ ప్రెసిడెంట్ సలగల ఎలీషాబాబు మాట్లాడుతూ ప్రజాసేవే పరమావధిగా బెటర్ లైఫ్ చారిటబుల్ ట్రస్ట్ పనిచేస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ట్రస్ట్ ట్రెజరర్ ఏపూరి బాబురావు ట్రస్ట్ ప్రారంభోత్సవ కార్యక్రమ వివరాలు తెలిపారు.ట్రస్ట్ చిన్నపిల్లలు, వృద్ధులకు సేవ చేయుటకు ఏర్పాటు చేయడం జరిగిందని, సమాజంలో ఎవరైతే ఆసరా లేని వారు ఉంటారో వారికి మా ట్రస్ట్ చేయూతనిస్తుందని తెలియజేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ పి.పురుషోత్తం మాట్లాడుతూ పిల్లలకు సేవ చేసే అవకాశం అందరికీ రాదని,ఈ ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించాలని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో తదనంతరం ప్రేమ విందు ఏర్పాటు చేశారు.సిఫార్డ్ స్వచ్ఛంద సేవా సంస్థ కోఆర్డినేటర్ బడుగు కిషోర్,అడ్వకేట్స్ మధుబాబు,శంకర్ ప్రసాద్,కిషోర్, కాగిత కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.




# ఉజ్వల భవిష్యత్‌కు చదువు ఒక్కటే మార్గం

### పరీక్షల్లో విజయం సాధించడమే,, మీ లక్ష్యం కావాలి,,



**కోసిగి.మార్చి14 (నవభూమి) :**కోసిగి మండల కేంద్రమైన సమీకృత బాలుర వసతి గృహం విద్యార్థులకు అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు యస్.ఈరేష్ ఆధ్వర్యంలో శుక్రవారం పరీక్ష ప్యాడ్,పెన్నులు, విద్యార్థులకు అందజేశారు .ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిపిఐ మండల కార్యదర్శి గోపాల్ హాస్టల్ వార్డెన్ కోటేశ్వరయ్య పాల్గొని మాట్లాడుతూ ఈనెల 17వ తేదీ నుండి జరుగు పది తరగతి పరీక్షల్లో విద్యార్థులు మానసిక ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా చదివిన ప్రతి సబ్జెక్టు పరీక్షలలో రాయాలని అలాగే పరీక్షలల్లో ఉత్తీర్ణత సాధించి కోసిగి మండలానికి మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని హాస్టల్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. విద్యార్థులకు మానసిక ఒత్తిడి గురి కాకుండా విద్యార్థులలో మెదడులో ధైర్యాన్ని నింపడం కోసం విద్యార్థుల పక్షాన పోరాడుతూ విద్యార్థులకు పరీక్షల సమయానికి ముందే పెన్నులు,ప్యాడ్స్ సహాయ సహకారాలు అందిస్తూ విద్యార్థులకు తోడ్పడుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులను వారు అభినందించారు అనంతరం ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు యస్.ఈరేష్ మాట్లాడుతూ మేము చేస్తున్నా మానవ దృక్పథం పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులలో వెలుగులు నింపడం కోసం ఏఐఎస్ఎఫ్ నాయకులుగా చేస్తున్న సమాజ సేవను చూసి ఎంతోమంది ,విద్య,వైద్యా,ఉపాధ్యాయులు సహాయ సహకారాలు అందిస్తున్న వారికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలుపుకుంటున్నాము అన్నారు .

# పిఠాపురంలో జనసేన ఆవిర్భావ సభకు తరలిన బాపట్ల జన సైనికులు



**బాపట్ల - నవభూమి :** జనం గుండెల్లో రలిగిన ఉద్యమం జనసేన డిప్యూటీ సీఎం పవన్ ప్రస్తానం నవ శకానికి నాంది పలికిందని బాపట్ల టౌన్ జనసేనా పార్టీ సీనియర్ నాయకులు కరుమూరి ఆంజనేష్ తెలిపారు.ఉవ్వెత్తున ఎగసిన ఉత్సాహంతో జన సైనికులు ఆంజనేష్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీతో పిఠాపురం వెళ్ళారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయన జనం గుండెల్లో నుంచి నిప్పు కణికలా ఉద్భవించిన పార్టీ జనసేన అని పేర్కొన్నారు.ఇది కేవలం ఒక పార్టీ పుట్టిన రోజు మాత్రమే కాదని,ఒక ఆశయం,ఒక సంకల్పం,ఒక నూతన శకానికి నాంది పలికిన రోజు అన్నారు.యువతకు ఉపాధి కల్పించడం,రైతులకు న్యాయం చేయడం,మహిళలకు భద్రత కల్పించడం,పేదలకు విద్య,వైద్యం అందించడం కోసం డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పని చేస్తున్నారని తెలిపారు.జనసేన పార్టీ కేవలం రాజకీయ పార్టీ మాత్రమే కాదని ఇది ఒక ఉద్యమమని చెప్పారు.ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా కార్యదర్శి గుంటుపల్లి తులసి కుమారి,అఖండ ఫౌండేషన్ అధ్యక్షులు బాపట్ల జనసేన నాయకులు విన్నకోట సురేష్,సురేంద్ర,మడాసాని బాలాజీ,దాసరి వినోద్,తిరుమలశెట్టి సాగర్,కామిశెట్టి సాయి,పెద్ది నాగు,జనసేన నాయకులు, కార్యక్తలు తదితరులు పాల్గొన్నారు.

# అందరికీ అందుబాటులో లక్ష్మి ఫోటో ఫ్రేమ్ వర్క్స్

**నెల్లూరు,మార్చి 14,(నవభూమి)::**నెల్లూరు నగర ప్రజలందరికీ అందుబాటులో ఉండే విధంగా నెల్లూరు నగరంలోని నవాబుపేట సెంటర్ నుంచి మైపాడు గేట్ సెంటర్ కు వెళ్లే దారిలో నూతన లక్ష్మీ ఫోటో ఫ్రేమ్ వర్క్స్,ఫోటో స్టూడియో ప్రారంభించామని.. సరసమైన ధరలకే ఫోటో ఫ్రేమ్ వర్క్స్ అందిస్తున్నామని.. ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని లక్ష్మీ ఫోటో ఫ్రేమ్ వర్క్స్,ఫోటో స్టూడియో అధినేత రవితేజ కోరారు.నూతన లక్ష్మీ ఫోటో ఫ్రేమ్ వర్క్స్,ఫోటో స్టూడియో ప్రారంభానికి లక్ష్మీ ఫోటో ఫ్రేమ్ వర్క్స్,ఫోటో స్టూడియో అధినేత రవితేజ,భాను ప్రకాష్,గోపి,ప్రియాంక,లక్ష్మి,షర్మిల పాల్గొని.. బంధుమిత్రులతో కలసి అట్టహాసంగా లక్ష్మీ ఫోటో ఫ్రేమ్ వర్క్స్,ఫోటో స్టూడియోని ప్రారంభించారు.ఈ సందర్భంగా లక్ష్మీ ఫోటో ఫ్రేమ్ వర్క్స్,ఫోటో స్టూడియో అధినేత రవితేజ మాట్లాడుతూ ఈ లక్ష్మీ ఫోటో ఫ్రేమ్ వర్క్స్,ఫోటో స్టూడియోలో హ్యాండ్ క్రాఫ్ట్ డిజైన్ లతో పాటు కుందన్ మెటల్,ఫుల్ స్టోన్,ఆఫ్ స్టోన్, గరుడ మెటల్ లతో తయారు చేసిన ఫోటో ఫ్రేమ్స్ అన్ని కూడా అందుబాటులో ఉన్నాయన్నారు.ఈ ఫ్రేమ్లలో ఎల్ఈడి లైట్లులతో పాటు పెన్ డ్రైవ్ పెట్టుకొనే ఫోటో ఫ్రేమ్స్ అందుబాటులో ఉన్నాయన్నారు.అంతేకాకుండా కస్టమర్లకు నచ్చే విధంగా నూతన డిజైన్లతో ఫోటో ఫ్రేమ్స్ తయారుచేసి అందించడం జరుగుతుందన్నారు. ఈ ఫోటో ఫ్రేమ్ షాపును ప్రజలందరూ సందర్శించి ఆదరించాలని కోరారు.





# నెలాఖరుకు సాగర్ నీరు నిలిపివేత



**దర్శి-నవభూమి:** రబీ సీజ న్‌లో సాగు చేసిన వరిపైరు చేతికందు తుందో, లేదోనని రైతులు ఆందోళన చెందు తున్నారు. ఈనెలాఖరు వరకు మాత్రమే సాగునీటిని పంపిణీ చేస్తామని అధికారు లు ప్రకటించారు. ఆతర్వాత నీటి సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు. దీంతో లేత వరిపైరు దక్కే పరిస్థితి కనిపించటం లేదు.దర్శి ప్రాంతంలో రబీ సీజన్‌లో సుమారు ఐదువేల ఎకరాల్లో వరిపైరు సాగు చేశారు. ప్రస్తుతం ఆ పైరు కంకితీసే దశలో ఉంది. సుమారు నెలరోజులు సాగు నీరు సరఫరా చేస్తేనే ఆ వరి పైరు పండుతుంది. నె లాఖరుకు నీటిని నిలిపివేస్తామని అధికారులు ప్రక టించారు. దీంతో వేలాది రూపా యలు పెట్టుబడులు పెట్టి సాగు చేసిన వరిపైరు పంట చేతికందే సమయంలో నీరులేక ఎండిపోయే పరిస్థితి నెలకొంటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. గత కొన్నిరోజులుగా సాగర్ కాలువలకు నీటి సరఫరా అరకొరగా జరుగుతుంది. అన్నీ మేజర్లకు నీరు సక్రమంగా అందటం లేదు. చివరి ప్రాంతాలకు నీరు చేరటం లేదు. దీంతో ఆయకట్టు చివరి భూముల రైతులు ఆలస్యంగా వరిపైరు సాగు చేశారు. కొంతమంది రెండో పంట కింద రబీలో వరి నాట్లు వేశారు. కనీసం ఏప్రిల్ 15 వరకు నీరు సరఫరా చేస్తే అన్నీ పంటలు దక్కుతాయని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం కూడా సాగర్ కాలువలకు అరకొరగానే నీటిని విడుదల చేస్తున్నారు. అనేక మేజర్లకు ఇప్పుడు కూడా నీరు సక్రమంగా అందటం లేదు.

# నేటి నుంచి ఒంటిపూట బడులు



**బాపట్ల -నవభూమి :**పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్,ఆంధ్రప్రదేశ్ అమరావతి వారి ఉత్తర్వుల మేరకు జిల్లాలోని అన్ని పాఠశాలల యాజమాన్యాలకు సంబందించిన ప్రభుత్వ,ప్రైవేటు పాఠశాలలకు ఈ నెల 15వ తేది నుంచి విద్యా సంవత్సరం ఏప్రిల్ 23వ తేదీ వరకు ఒంటిపూట బడి ఉదయం 7:45 నుంచి మధ్యాహ్నం 12:30 వరకు నిర్వహించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.పురుషోత్తం తెలిపారు.పదవ తరగతి పరీక్షా కేంద్రాలుగా కేటాయించిన పాఠశాలలు మాత్రం పరీక్షలు పూర్తయ్యే వరకు మధ్యాహ్నం 1:00 నుంచి 05ల వరకు బడులు నిర్వహించాలని పురుషోత్తం తెలిపారు.

# శ్రీనివాస కళ్యాణోత్సవానికి సీఎంకు ఆహ్వానం



**నెల్లూరు,మర్చి 14,(నవభూమి)::**అమరావతిలోని వెంకటపాలెంలో ఉన్న వేంకటేశ్వరస్వామివారికి శనివారం నిర్వహించనున్న కల్యాణోత్సవంలో పాల్గొనవలసిందిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని తిరుమల తిరుపతి దేవస్థానం ఛైర్మన్ బి ఆర్ నాయుడు,ఆలయ ఈవో శ్యామలరావు,జేఈవో వెంకన్న చౌదరి,బోర్డు మెంబర్,కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి,ఇతర సభ్యులు ప్రత్యేకంగా ఆహ్వానించారు.శుక్రవారం సీఎం చంద్రబాబు నాయుడుని ఉండవల్లిలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా శనివారం వెంకటపాలంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో జరిగే శ్రీనివాస కళ్యాణోత్సవానికి సీఎంను ఆహ్వానించారు.ఈ మేరకు టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు,ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆహ్వాన పత్రికను సీఎంకు అందజేశారు.

# అభివృద్ధిలో అగ్రగామిగా నిలపడమే లక్ష్యం

### ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రధమ ప్రాధాన్యం

### ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు



**మార్టూరు, మార్చి 14 ( నవభూమి)** రాష్ట్రంలో పర్చూరు నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అగ్రగామిగా నిలపడమే తన లక్ష్యమని విజనరీ లీడర్ అవార్డు గ్రహీత ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. శుక్రవారం ప్రజా దర్బార్ లో బాగంగా ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి మాట్లాడుతూ ప్రజా సంక్షేమం అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నట్లు ఎమ్మెల్యే ఏలూరి పేర్కొన్నారు. అస్తవ్యస్తం గా ఉన్న పాలనను ముఖ్యమంత్రి చంద్రబాబు గాడిలో పెట్టేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. అపారా అనుభవం విజన్ కలిగిన చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని ఎమ్మెల్యే ఏలూరి పేర్కొన్నారు. అభివృద్ధి సంక్షేమ దిశగా పనిచేశానన్నారు. రాష్ట్ర పునర్నిర్మాణానికి చంద్రబాబు యజ్ఞం చేస్తున్నారన్నారు. అహర్నిశలు రాష్ట్ర అభివృద్ధికి పాటుపడుతున్నారని వివరించారు. చంద్రబాబును స్ఫూర్తిగా తీసుకొని ప్రతి ఒక్కరు పని చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. సీఎం చంద్రబాబు సహకారంతో నియోజకవర్గాన్ని రాష్ట్రంలో ఒక రోల్ మోడల్ గా నిలిపేందుకు కృషి చేస్తానన్నారు.అర్హులైన ప్రతి ఒక్కరికి అభివృద్ధి సంక్షేమ పథకాలు అందిస్తానన్నారు.జన సేనానికి శుభాకాంక్షలు జనసేన పార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని అధినేత , డిప్యూటి సీఎం పవన్ కల్యాణ్, నేతలు, కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు. ఏపీ ఆర్థిక, సామాజిక అభివృద్ధికి జనసేన చిత్తుశుద్ధితో పనిచేస్తోందన్నారు. రాష్ట్రాభివృద్ధిలో జనసేన కీలకం పాత్ర పోసించిందన్నారు.

# అబ్దుల్ కలాం ఫౌండేషన్ కర్లపాలెం ద్వారా.. ప్రతి శుక్రవారం సేవలు

**కర్లపాలెం, మార్చి 14 ( నవభూమి) :**అబ్దుల్ కలాం ఫౌండేషన్ కర్లపాలెం ద్వారా ప్రతి శుక్రవారం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని ఫౌండేషన్ ప్రెసిడెంట్ ,గ్రామ ఉప సర్పంచ్ పఠాన్ అహ్మద్ బాష తెలిపారు.కర్లపాలెం అబ్దుల్ కలాం ఫౌండేషన్ ఆధ్వర్యంలో కర్లపాలెం దండుబాటలోని మజీద్ సమీపంలో 16 మంది నిరుపేద మహిళలకు చీరెల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ముఖ్య అతిధిగా జడ్పీటీసీ పిట్ల వేణుగోపాల్ రెడ్డి పాల్గొని మహిళలకి చీరెలు అందజేశారు.ఈ సందర్భంగా పఠాన్ అహ్మద్ బాష మాట్లాడుతూ పేదలకు ప్రతి శుక్రవారం బియ్యం ,నిత్యావసర సరుకులు ,దుప్పట్లు ,అనారోగ్యంగాఉన్న వారికి ఆర్థిక చేయూత అందించడం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో షేక్ మస్తాన్ వలి ( కెప్టెన్ ఆర్మీ రిటైర్డు ) ,షేక్ ఇబ్రహీం, షేక్ బహదూర్ బాష ,షేక్ జిలాని ,షేక్ జానీ బాష ,షేక్ గఫూర్ ,షేక్ హబీబ్ తదితరులు పాల్గొన్నారు.



# ఉల్లాసంగా,ఉత్సాహంగా ఆటల పోటీలు

- శరీర దృఢత్వానికి ఆటలు ఎంతో ఉపయోగపడతాయి
- కూలింగ్ వాటర్ కూలర్‌ని వాకర్స్ అందరూ వినియోగించుకోండి
- యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నెల్లూరు రీజినల్ హెచ్ ఓడి రాజా శేఖరం
- కూలింగ్ వాటర్ కూలర్,ఆటల పోటీలను ప్రారంభించిన రాజా శేఖరం







**నెల్లూరు,మార్చి 14, (నవభూమి)::**ప్రతి ఒక్కరు ఆటలు ఆడటం వల్ల శరీరానికి మానసిక ఉల్లాసాన్ని ఇస్తుందని,అంతేకాకుండా శరీర దృఢత్వానికి ఆటలు ఎంతో ఉపయోగపడతాయని.. ప్రతి ఒక్కరు ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టి.. ఆటలు ఆడటం వల్ల ఆరోగ్యంగా జీవించవచ్చని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నెల్లూరు రీజినల్ హెచ్ ఓ డి రాజా శేఖరం పేర్కొన్నారు.యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నెల్లూరు రీజినల్ ఆధ్వర్యంలో నెల్లూరు నగరంలోని సుబ్బారెడ్డి స్టేడియంలో నూతనంగా ఏర్పాటు చేసిన కూలింగ్ వాటర్ కూలర్,పలు ఆటల పోటీలు ప్రారంభానికి ముఖ్య అతిథిగా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నెల్లూరు రీజినల్ హెచ్ ఓడి రాజాశేఖరం పాల్గొని.. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నెల్లూరు రీజినల్ ఉద్యోగస్తులతో కలిసి కూలింగ్ వాటర్ కూలర్,పలు ఆటల పోటీలను అట్టహాసంగా ప్రారంభించారు.పోటీల్లో గెలుపు పొందిన విజేతలకు షీల్డ్ మెమొంటోలను అందజేశారు.ఈ సందర్భంగా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నెల్లూరు రీజినల్ హెచ్ ఓడి రాజాశేఖరం మాట్లాడుతూ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నెల్లూరు రీజినల్ లో విధులు నిర్వహించే బ్యాంకు ఉద్యోగస్తులందరూ.. నిత్యం సతమతమవుతూ విధులు నిర్వహిస్తుంటారన్నారు.వారందరికీ ఉల్లాసంగా,ఉత్సాహంగా వచ్చే విధంగా సుమారు 60 బ్రాంచుల ఉద్యోగస్తులు పలు ఆటలు ఆడడం జరిగిందన్నారు.ఉద్యోగస్తులందరూ ఒకే చోట కలుసుకొని.. ఆటల ఆడడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.రాబోయే రోజుల్లో ఇటువంటి ఆటల పోటీలు మరెన్నో నిర్వహిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో వేణుగోపాల్,హేమంత్, జయకృష్ణ,సుధీర్,బాలకృష్ణ,లలిత,స్వరూప, దివాకర్,వాసు,తదితరులు పాల్గొన్నారు.

# గోవాడ షుగర్ ఫ్యాక్టరీ సమస్యలపై 21న మహాధర్నా

- రైతు, కార్మిక, ప్రజా సంఘాల రౌండ్ టేబుల్ సమావేశంలో తీర్మానం



**మాడుగుల మార్చి 14 నవభూమి :**గోవాడ షుగర్ ప్యాక్టరి సమస్యలు పరిష్కారం చేయాలని ఈనెల 21 షుగర్ ప్యాక్టరి గేటు వద్ద మహ దర్నా చేపట్టాలని, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, రైతు కూలీ సంఘం నాయకులు మోహన్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి డి వెంకన్న, సిఐటియు జిల్లా నాయకులు వి.శ్రీనివాసరావు తదితరులు పేర్కొన్నారు.శుక్రవారం చోడవరం మేయిన్ రోడ్డు అంబేద్కర్ భవన్ లో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు యస్వీ నాయుడు అధ్యక్షతన ప్రజాసంఘాలు రౌండ్ టెబుల్ సమావేశం జరిగింది.అనంతరం వారు మాట్లాడుతూ గోవాడ షుగర్ ఫ్యాక్టరీ రైతులు కార్మికుల బకాయిల చెల్లించాలని, డిమాండ్ చేసారు.ప్రభుత్వం ఫ్యాక్టరీ ఆధునికరణ కు 350 కోట్లు తక్షణ సాయం క్రింద రైతు కార్మికులు భకాయిలకు 35 కోట్ల రూపాయలు విడుదల చేయాలని డిమాండ్ల పై ఈ సమావేశం తీర్మానం చేసిందన్నారు.ఫ్యాక్టరీని ఇక్కడ రైతాంగం ప్రజలు కాపాడు కోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు.దీని కోసమే ఈనెల 21 వ తేదీన గోవాడ ఫ్యాక్టరీ వద్ద మహా ధర్నాకు పిలుపునివ్వడం జరిగిందని తెలిపారు.ఈ మహా ధర్నా లో రైతులు, కార్మికులు, ప్రజలు రాజకీయాలకు అతీతంగా పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని సమావేశం పిలుపు నివ్వడం జరిగిందని తెలిపారు.ప్రభుత్వం పాలకుల నిర్లక్ష్యంతో ఫ్యాక్టరీ పరిధిలోని రెండు నియోజక వర్గాల రైతాంగం తీవ్ర ఇబ్బందులు పాలవుతున్నారని ఏ రోజు ఫ్యాక్టరీ ఆగిపోతుందో తెలియని పరిస్థితి ఏర్పడిందని తెలిపారు.తీసుకొచ్చిన చెరుకు ఎండకు ఎండి రికవరీ రాక రైతాంగం ఫ్యాక్టరీ నష్టపోవలసిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు.ఈ పరిస్థితికి కారణమైన ప్రభుత్వ విధానాలపై రైతాంగం పెద్ద ఎత్తున పోరాడ వలసిన అవసరం ఉందన్నారు.ఇదే పరిస్థితి కొనసాగితే వచ్చే సీజనకు చెరకు లేక ఫ్యాక్టరీ పూర్తిగా మూత పడే పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.ఫ్యాక్టరీ మూత పడితే ఈ ప్రాంతమంతా ఎడారిగా మారే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.రాష్ట్రం లోనే సహకార రంగంలో నడుస్తున్న గోవాడ షుగర్ ఫ్యాక్టరీని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. రైతులు, కార్మికులు బకాయిలకై , ఆధునికరణకై ప్రభుత్వం తక్షణ సాయంగా 35 కోట్లు, ఆధునీకరణ కై 350 కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేసారు. ఈ ఫ్యాక్టరీ లేక పోతే ఈ ప్రాంతంలో రైతులు,కార్మికులు రోడ్డున పడతారన్నారు. అనంతరం గోవాడ షుగర్ ప్యాక్టరి చేరకు పరిరక్షణ కమిటీ కన్వీనర్లు గా ఆర్ దేముడు నాయుడు కో కన్వీనర్ యస్వీ నాయుడు నియమితులయ్యారు.ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా కోశాధికారి జి.నాయనబాబు,ఆర్ దేముడు నాయుడు, ఈ.ఎన్ మూర్తి, దేముళ్లు, డి తాతారావు, నర్సింగరావు, నాగిరెడ్డి సత్య నారాయణ, ఏ అప్పలనాయుడు, వి సత్యం, కోన మోహనరావు, బిటి దొర అదిక సంఖ్యలో రైతు కార్మికులు పాల్గొన్నారు.

# మహిళల భద్రతకు రక్షణ కవచం శక్తి యాప్

- ప్రతి మహిళ ఫోన్లో శక్తి యాప్ నిక్షిప్తం చేసుకోవాలి
- ఆపదలో ఉన్న మహిళలు తక్షణ పోలీస్ సహాయం
- ఎస్.ఓ.ఎస్ బటన్ ప్రెస్ చేస్తే చాలు
- ప్రదేశానికి చేరుకోనున్న పోలీసులు
- జిల్లా ఎస్పీ తుషార్ డూడి






**బాపట్ల -నవభూమి :** మహిళల భద్రతకు రక్షణ కవచం లాంటిదిశక్తి యాప్ అని బాపట్ల జిల్లా ఎస్పీ దూడి తెలిపారు.శక్తి యాప్ మహిళలకు ఏవిధంగా ఉపయోగపడుతుందో, వినియోగించుకునే విధానం గురించి ఎస్పీ వివరించారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మహిళలు, బాలికల భద్రత కొరకు శక్తి యాప్‌ను ప్రవేశపెట్టిందన్నారు. ఈ యాప్ ప్రధానంగా మహిళలపై జరిగే వేధింపులు, ఇతర హింసాత్మక ఘటనలను నివారించటానికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ప్రతీ ఒక్క మహిళ, విద్యార్థినిలు వారి యొక్క ఫోన్‌లలో శక్తి యాప్‌ను నిక్షిప్తం చేసుకోవాలని సూచించారు. యాప్‌ను వినియోగించుకొని ఆపద సమయంలో పోలీసుల తక్షణ సహాయం, సహకారం పొందవచ్చు నన్నారు.ఆపదలో ఉన్న మహిళలు యాప్ లో వున్న ఎస్.ఓ.ఎస్ బటన్ ప్రెస్ చేస్తే వారు ఉన్న ప్రాంతం వివరాలు దగ్గర్లో ఉన్న పోలీస్ స్టేషన్‌కు డయల్ 112 నెంబరుకు చేరుతుందన్నారు. వెంటనే పోలీసులు అప్రమత్తమై సంఘటన స్థలానికి చేరుకొని వారికి రక్షణ కల్పించే విధంగా చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. శక్తి యాప్‌ను ఫోన్లో నిక్షిప్తం ఉపయోగించే విధానంముందుగా ఫోన్లో ఉన్న గూగుల్ ప్లే స్టోర్ ద్వారా శక్తి యాప్‌ను డౌన్లోడ్ చేసుకోవాలిమీ వ్యక్తిగత వివరాలను నమోదు చేసుకోవాలి ఓ.టి.పి. తో ఫోన్ నెంబర్ అనుసంధానం చేసుకోవాలి. అత్యవసర సమయంలో సంప్రదించవలసిన నెంబర్లను జోడిరచాలి.ఏదైనా ప్రమాదం జరిగితే, యాప్ ఓపెన్ చేసి ఎస్ఓఎస్ బటన్‌పై ప్రెస్ చేస్తే,మీరు ఉన్న ప్రదేశాన్ని గుర్తించి పోలీసులు తక్షణమే స్పందిస్తారు.సెైట్ షెల్టర్ల వివరాలు అందుబాటులో ఉంటాయి, జిల్లా కేంద్రంగా సఖీ ఒన్ స్టాప్ సెంటర్ వివరాలు అందుబాటులో ఉంటాయి.శక్తి యాప్ యొక్క ముఖ్య ప్రయోజనాలుఅత్యవసర సహాయం – మహిళలు ఏదైనా ఆపదలో ఉన్నప్పుడు, ఈ యాప్ ద్వారా పోలీసులకు వెంటనే సమాచారం ఇవ్వవచ్చు.ఒక క్లిక్ ఎస్ఓఎస్ అలర్ట్ – ఒక్క క్లిక్ నొక్కితే పోలీసులకు, కుటుంబసభ్యులకు, (లేదా) స్నేహితులకు అప్రమత్తమైన సందేశం వెళ్ళిపోతుంది.జియో– లోకేషన్ ట్రాకింగ్– అత్యవసర పరిస్థితుల్లో, పోలీస్ కంట్రోల్ రూమ్ మహిళ ఉన్న ప్రదేశాన్ని తక్షణమే గుర్తించి సహాయం అందించగలదు.నేరం నివేదిక – వేధింపు, లైంగిక దాడి, ఎవరైనా శారీరకంగా హాని కలిగించినప్పుడు, మహిళలు ఈ యాప్ ద్వారా నేర సమాచారాన్ని అధికారులకు తెలియజేయవచ్చు.సమాచార అవగాహన – మహిళా హక్కులు, రక్షణ చట్టాలు, మరియు ప్రభుత్వ నిబంధనల గురించి పూర్తి వివరాలు పొందవచ్చు.ప్రత్యక్ష పోలీస్ సహాయం – సమీపంలోని పోలీస్ స్టేషన్ సమాచారం, హెల్ప్ లైన్ నంబర్లను యాప్ లో పొందుపరిచారు.బాపట్ల జిల్లాలో శక్తి బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందని ఎస్పీ తెలిపారు. ఒక్కొక్క బృందంలో 6 గురు సభ్యులు ఉంటారన్నారు. ప్రతి బృందానికి ఒక ఎస్సై ఇన్చార్జిగా ఉంటారన్నారు. ప్రస్తుతం బాపట్ల జిల్లాలోని రేపల్లె, చీరాల, బాపట్ల సబ్ డివిజన్ ల పరిధిలలో మూడు బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జిల్లాలోని మహిళలు, బాలికలు, విద్యార్థినులు, ఉద్యోగినులు, గృహిణులు అత్యవసర పరిస్థితుల్లో రక్షణ అవసరమైన వారు "శక్తి యాప్" వినియోగించుకొని శక్తి బృందాల ద్వారా మరింత భద్రత పొందవచ్చునన్నారు. మహిళలు, చిన్నారులు తమకు ఎదురయ్యే వివిధ పిర్యాదులు, ఇబ్బందుల పై పోలీసు వారి సహాయం కొరకు శక్తి యాప్ వినియోగించుకోవాలన్నారు. దగ్గరలోని పోలీస్ స్టేషన్ కు వేగవంతంగా సమాచారం చేరడంతో పోలీసు సిబ్బంది తక్షణం స్పందించి శర వేగవంతంగా సంఘటన స్థలానికి చేరుకొని కావలసిన సహాయం, సహకారం అందిస్తారన్నారు. కావున జిల్లాలో ప్రతీ ఒక్క మహిళ, విద్యార్థినిలు, బాలికలు, ఉద్యోగినులు, గృహిణులు తమ యొక్క ఫోన్ లలో శక్తి యాప్ ను నిక్షిప్తం(డౌన్లోడ్) చేసుకోవాలని జిల్లా ఎస్పీ సూచించారు.

# ఓఎన్జిసి పైప్ లైన్ నుంచి గ్యాస్ లీక్



**అమలాపురం. మార్చి14.( నవభూమి ప్రతినిధి)** మామిడికుదు గ్రామం శివారు ఏటిగట్టు ప్రక్కన ఉన్న పంట పొలాల్లో శుక్రవారం గ్యాస్ పైప్ లైన్ లీక్ ఏర్పడింది పాసర్లపూడి ఓఎన్జిసి ట్రక్చర్ పరిధిలోని పా పాసర్లపూడి 43 బావి నుంచి ఏర్పాటు చేసిన పైప్లైన్ నుంచి ఈ లీక్ ఏర్పడినట్లు గుర్తించారు ఈ లీకేజ్ ఏర్పడిన ప్రాంతంలో ముడుచుమురు తేట్టుగా ఏర్పడింది ఆ ప్రాంతమంతా ఎటు చూసినా ముడు సమరువాసన.

# విద్యుత్ ప్రమాదం వలస కూలి మృతి



**పెద్దపంజాణి నవభూమి మార్చి 14 :**పెద్దపంజాణి మండలం చికలిదిన్నె పల్లి సమీపంలో ఉన్న పౌల్ట్రీ ఫార్మ్ విద్యుత్ ప్రమాదంలో చత్తీస్గడ్ చెందిన వలస కూలీ మృతి వివరాల మేరకు చత్తీస్గడ్ చెందిన సంతు యాదవ్ కుమారుడు కిరణ్ సాయి యాదవ్ వ 24సం గర ఒక సంవత్సరం నుండి చికలిదిన్నే పల్లి లోని ఓ ప్రైవేట్ కోళ్ల పెంపకం స్థావరం లో కూలీ పని చేసుకుంటూ జీవించేవాడు పౌల్ట్రీ ఫార్మ్ నందు ఫ్యాన్ పనిచేయక పోవడం ద్వారా మరమత్తులు చేస్తుండగా విద్యుత్ షాక్ తగిలి అపస్మిక స్థితిలో వెళ్లిపోవడం ద్వారా 108 కి సమాచారం అందించి చికిత్స కొరకు తరలిస్తుండగా మార్గమధ్యం లోనే మృతి చెందాడు విషయం తెలుసుకున్న పెద్దపంజాణి పోలీసు వారు సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# ఉపాధి కూలీలు అపోహలు పడవద్దు..ఏపీవో కోటేశ్వరి



**కొరిశపాడు, మార్చి 14 (నవభూమి):** కొరిశపాడు మండలంలో అన్ని గ్రామాలలో ఉపాధి హామీ పనులు జరుగు తున్నట్లు ఏపీవో కోటేశ్వరి శుక్రవారం తెలిపారు. కూలీలు డబ్బులు పడవని అపోహలు పడుతున్నట్లు ఫీల్డ్ అసిస్టెంట్ ల ద్వారా తమ దృష్టికి వచ్చిందని అన్నారు. అలాంటి అపోహలు పడవద్దని ఈ నెలలో పెండింగ్లో ఉన్న డబ్బులు కూడా జమ అవుతాయని ఆమె పేర్కొన్నారు. కావున ప్రతి ఒక్కరూ పని దినాలను వినియోగించుకోవాలని కోరారు.

# నకిలీ ఎస్సై అరెస్ట్

### ఎస్సైనంటూ వసూళ్లకు శ్రీకారం పట్టుకున్న సంఘం పోలీసులు

### కేసు నమోదు విలేకరుల సమావేశంలో డీఎస్పీ వేణుగోపాల్



**ఆత్మకూరు నవభూమి :**ఎస్ఐ కావాలన్న లక్ష్యంతో పోరాడి విజయం సాధించలేకపోవడంతో విరక్తి చెందిన ఓ వ్యక్తి పోలీస్ ఎస్ఐ దుస్తులు ధరించి తన కోరిక తీర్చుకున్నాడు. అయితే అంతటితో ఆగకుండా ఎస్సై దుస్తులు వేసుకొని సంఘం చెక్ పోస్ట్ వద్ద వాహనాలు ఆపి వసూళ్లకు తెరలేపడంతో విషయం తెలుసుకున్న సంఘం పోలీసులు నకిలీ ఎస్ఐని రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. పూర్తిస్థాయిలో విచారణ జరగడంతో అసలు విషయం బయటపడింది. ఆమెరకు ఆత్మకూరు డిఎస్పి వేణుగోపాల్ శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకొలను కు చెందిన హరీష్ అనే వ్యక్తి పోలీస్ ఎస్ఐ కావాలన్న కాంక్షతో అనేక ప్రయత్నాలు చేశాడని తెలిపారు. అయితే ఎస్సై కాలేకపోవడంతో నిరాశ చెందిన ఆ వ్యక్తి పోలీస్ యూనిఫాం వేసుకుని ఎస్ఐ స్టార్లు పెట్టుకొని షిఫ్ట్ డిజైర్ కారులో సంఘం వచ్చాడని తెలిపారు. పాత చెక్పోస్ట్ సమీపంలో వాహనాలను ఆపి వసూలు చేసేందుకు ప్రయత్నించాడు. దాంతో విషయం తెలుసుకున్న సంగం సీఐ వేమారెడ్డి, ఎస్ఐ రాజేష్ లు హుటాహుటిన పాత చెక్పోస్ట్ వద్దకు వెళ్లారు. అక్కడ వసూళ్లకు పాల్పడుతున్న నకిలీ ఎస్ఐ ని గుర్తించారు. సరైన వివరాలు తెలపకపోవడంతో స్థానిక పోలీస్ స్టేషన్కు తీసుకువచ్చి పూర్తి వివరాలను రాబట్టారని డిఎస్పి తెలిపారు. ఆ మేరకు నకిలీ ఎస్సైగా వ్యవహరించిన హరీష్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఎవరైనా తాము పోలీసులమని మరో శాఖ ఉద్యోగులమని జడ్జీలమని బెదిరించి ఆన్లైన్లో నగదు వేయమని అడిగితే ప్రజలు ఆ మాటలను విశ్వసించరాదని తెలిపారు. అలాంటి వారి గురించి స్థానిక పోలీసులకు తెలియజేయాలని సూచించారు.

# జిల్లా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా రాధా మాధవి



**బాపట్ల - నవభూమి :** జిల్లా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్‌గా రాధామాధవి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. పట్టణంలోని అక్బర్ పేటలో గల బాల సదనంలో బాపట్ల జిల్లా శిశు సంక్షేమశాఖ కార్యాలయంకు చేరుకుని సిబ్బంది నుంచి పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు.

నవభూమి
www.navabhoomi.in
9 | హైదరాబాద్
శనివారం
15 । మార్చి 2025

# మంత్రాలయంలో భక్తుల రద్దీ



**మంత్రాలయం-నవభూమి :** రాఘవేంద్ర స్వామి దర్శనార్థం భక్తులతో మంత్రాలయం కిక్కిరిసింది. గురువారం వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నా వేదపండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల మధ్య రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి బంగారు కవచం సమర్పణతో పాటు విశేష పుష్పాంకరణ సేవ చేశారు. రాఘవేంద్రస్వామి సజీవ సమాధి పొందిన పాల్గుణ చతుర్ధశి గురువారం శుభదినాన్ని పురస్కరించుకొని మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ఆశీస్సులతో మఠం పండితులు బృందావనానికి సుప్రభాతం, నిర్మల విసర్జనం, క్షీరాభిషేకం, తులసి అర్చన, విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. బంగారు, వెండి, పట్టు వస్త్రాలు, బెంగళూరు నుంచి తెచ్చిన ప్రత్యేక పుష్పాలు, బంగారు కవచంతో చూడ ముచ్చటగా అలంకరించారు. ఇది భక్తులను ఎంత గానో ఆకట్టుకుంది. పండితులు పూజలు, హస్తోదకం చేసి మహా మంగళహారతులు చేశారు.రాఘవేంద్ర స్వామి మఠానికి రూ.3 లక్షల విరాళం : మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠానికి ముంబయికి చెందిన శశికళ పాటిల్ అనే భక్తురాలు రూ.2 లక్షలు శాశ్వత సేవకు, అదే పట్టణానికి చెందిన కాంచన మంగలవేడి అనే భక్తురాలు రూ.లక్ష సుజయీంద్ర ఆరోగ్య శాలకు విరాళంగా ఇచ్చినట్లు మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు వెంకటేష్ జోషి, సురేష్ కోణాపూర్‌లు తెలిపారు. గురువారం వేర్వేరు సమయాల్లో కుటుంబ సమేతంగా రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని రూ.3 లక్షల నగదును విరాళం ఇచ్చినట్లు చెప్పారు.

## సాగరం కస్తూర్బా పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు



**మాడుగుల మార్చి 14 నవభూమి :**మాడుగుల : మండలం లోని సాగరం గ్రామం లో కస్తూర్బా పాఠశాల లో గురువారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమా నికి ముఖ్య అతిథిగా అనకాపల్లి జిల్లా ప్రధాన సివిల్ జడ్జి ధర్మారావు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినీ లకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గురించి అవగాహన కల్పించారు. అనంతరం చోడవరం బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనాథు ప్రసాద్ రావు మాట్లాడుతూ పిల్లలకు మొబైల్స్ సోషల్ మీడియా గురించి తెలిపి , వాటికి దూరంగా ఉండాలి అని సూచించారు.ఈ కార్యక్రమం లో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు , ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జనసేన పార్టీ ఆవిర్భవ దినోత్సవం



**బాపట్ల - నవభూమి :** పట్టణంలోని 14వ వార్డులో జనసేన పార్టీ 12వ ఆవిర్భవ దినోత్సవన్ని సందర్భంగా బాపట్ల నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త నామన వెంకట శివన్నారాయణ ఆదేశాల మేరకు కేఆర్‌కే నాయుడు,చల్లా శ్రీనివాసరావు,కొక్కిరాల రాజేంద్ర,కంచర్లపల్లి కిషోర్ నేతృత్వంలో ఘనంగా కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఉమ్మడి గుంటూరు జిల్లా లీగల్ సెల్ సభ్యురాలు,బాపట్ల ప్రభుత్వ ఆసుపత్రి డెవలప్మెంట్ సభ్యురాలు జిడుగు విజయ మాధురి,ఊసా మాధవి,షేక్ కరీముల్లా,గంట నాగమల్లేశ్వరరావు,బడే అంకమ్మరావు,బెజ్జం బాబురావు,సాయి తేజ,గార్నిపూడి క్రీస్తు బాబు,జనసేన నాయకులు,జన సైనికులు,వీర మహిళలు,నియోజకవర్గ పవన్ కళ్యాణ్ అభిమానులు పాల్గొన్నారు.

## ఏయూ మాజీ వీసీ ప్రసాదరెడ్డిపై విచారణ

**విశాఖపట్నం-నవభూమి :**ఆంధ్ర విశ్వవిద్యాలయం మాజీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పీవీజీడీ ప్రసాదరెడ్డి అక్రమాలు, అడ్డగోలు నిర్ణయాలపై ప్రభుత్వం విచారణ జరి పించేందుకు సిద్ధమైంది. వైసీపీ హయాంలో ప్రసాదరెడ్డి తీసుకున్న నిర్ణయాలు, చేపట్టిన నియామకాలు, నిధుల దుర్వినియోగం ఆరోపణ లపై విచారణ నిర్వహించాలన్న డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది. ఈ నేపథ్యంలో గురు వారం అసెంబ్లీలో నగరానికి చెందిన ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, పల్లా శ్రీనివాసరావు, విష్ణుకుమార్‌రాజులు ప్రసాదరెడ్డి హయాంలో వర్సిటీలో జరిగిన అక్రమాలు, అడ్డగోలు వ్యవహా రాలపై ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలు కావస్తున్నా విచారణ జరపకపోవడంపై ప్రశ్నించారు. ఎమ్మెల్యేల ప్రశ్నలపై మంత్రి నారా లోకేష్ స్పందిస్తూ ప్రసాదరెడ్డి హయాంలో ఏయూలో జరిగిన అవినీతి, అక్రమాలపై 60 రోజుల్లో విజిలెన్స్ విచారణ పూర్తిచేసి, చర్యలు తీసు కుంటామని ప్రకటించారు. సుమారు రూ.20 కోట్ల రూసా నిధులు దుర్వినియోగం చేశారని, ఇస్రో నుంచి వచ్చిన రూ.25 లక్షల వ్యయంలో కూడా నిబంధనలు ఉల్లంఘించారని ఫిర్యాదు అంది నట్టు మంత్రి తెలిపారు.మాజీ వీసీ వ్యవహారాలపై ఇన్‌చార్జి వీసీ నియమించిన కమిటీ కూడా విచారణ జరిపినట్టు తెలిపారు. విజిలెన్స్ నివేదిక వచ్చిన వెంటనే బాధ్యులైన వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తా మని స్పష్టంచేశారు. మంత్రి ప్రకటనపై వర్సిటీలో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. అడ్డగోలు వ్యవహారాలన్నీ బయటకు వస్తాయని ఉద్యోగులు, విద్యార్థి సంఘాల నేతలు పేర్కొంటున్నారు.ఆరోపణలు ఎన్నో...మాజీ వీసీ ప్రసాదరెడ్డి తన హయాంలో రిటైర్డ్ ప్రొఫెసర్లకు అడ్డగోలుగా పదవులు కట్టబెట్టారు. ఈ జాబితాలో మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కృష్ణమోహన్ ముందువరుసలో ఉంటారు. పదవీ విరమణ తరువాత మూడు సార్లు ఆయనకు రిజిస్ట్రార్‌గా బాధ్యతలు కట్టబెట్టారు. ఆ తరువాత ఓఎస్‌డీగా నియ మించుకున్నారు. అనేక విభాగాల్లో ప్రిన్సిపాల్స్, డీన్లుగా, డైరెక్టర్లుగా పదవీ విరమణ చేసిన వారికి అవకాశం కల్పించారు.

## పోలవరం ఎనిమిదో ప్యాకేజీ పనుల్లో కదలిక

**అనకాపల్లి-నవభూమి :** పోలవరం ఎడమ కాలువ ఎనిమిదో ప్యాకేజీకి భూసేకరణకు అధికారులు చర్యలు చేపట్టారు. అనకాపల్లి, మునగపాక మండలాల్లో సుమారు 15.7 ఎకరాలను సేకరించనున్నారు.పోలవరం ఎడమ ప్రధాన కాలువకు సంబంధించి జిల్లాలో పాయకరావుపేట నుంచి తాళ్లపాలెం వరకు ఆరు, ఏడు ప్యాకేజీల కింద గతంలోనే పనులు చేపట్టిన విషయం తెలిసిందే. అయితే గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అన్ని పనులు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కేంద్రం నుంచి నిధులు మంజూరు చేయించి, మిగిలిన పనులకు టెండర్ల ప్రక్రియను కూడా పూర్తి చేసింది. ఇదిలావుండగా పోలవరం నీటిని విశాఖకు తరలించడానికి, ఇదే సమయంలో అనకాపల్లి, మునగపాక మండలాల్లో సుమారు 50 వేల ఎకరాలకు నీరు అందించడానికి గత టీడీపీ హయాంలోనే తాళ్లపాలెం నుంచి విశాఖ స్టీల్‌ప్లాంట్‌లోని కణితి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ వరకు ఎనిమిదో ప్యాకేజీగా ప్రకటించారు. ఇందులో భాగంగా తాళ్లపాలెం నుంచి అనకాపల్లి మండలం పిసినికాడ వరకు ఏలేరు కాలువను గతంలోనే విస్తరించారు. ఇక్కడ నుంచి కణితి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ వరకు విస్తరించాల్సి వుంది.

# మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు

◆ ఇఫ్తార్ విందు కార్యక్రమాల్లో ఎమ్మెల్యే దగ్గుపాటి ◆ 6వ రోడ్డులో ఎమ్మెల్యేకు ఘన స్వాగతం

◆ ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు





**అనంత పురం మార్చి 14 నవభూమి :**పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలో ఉండే ముస్లిం సోదరుల కోసం ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందు ఆత్మీయత, మత సామరస్యానికి ప్రతీక అని అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. అనంతపురం నగరంలో శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. తెలుగుదేశం పార్టీ నాయకుడు ఓంకార్ రెడ్డి ఆధ్వర్యంలో 6వ రోడ్డు లో గల మసీదులో జరిగిన ఇఫ్తార్ విందు కార్యక్రమానికి హాజరయ్యారు. ఈసందర్భంగా ముస్లిం సోదరులు, కాలనీ వాసులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ కు స్వాగతం పలికారు. ముందుగా మసీదులో ఉపవాస దీక్ష విరమణ ప్రార్థనలో ఆయన పాల్గొన్నారు. మసీదుకు కావలసిన వంట సామాగ్రిని టిడిపి నాయకుడు ఓంకార్ రెడ్డి ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ చేతుల మీదుగా మసీదు నిర్వాహకులకు అందజేశారు. అక్కడే ముస్లిం సోదరులకు భోజనం వడ్డించారు. అనంతరం టిడిపి నాయకుడు దాదు ఆధ్వర్యంలో బళ్లారి బైపాస్ లోని ఆటో హబ్ నందు రంజాన్ సందర్భంగా ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పాల్గొన్నారు. ముందుగా ముస్లిం సోదరులతో కలిసి ప్రార్థనలు చేసి ఆ తర్వాత పలహారాలు అందజేసి దీక్షలు విరమింపజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అల్లాహ్ ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని ఆకాంక్షించారు. కఠినమైన ఉపవాస దీక్షల ద్వారా క్రమ శిక్షణ ఏర్పడుతుందన్నారు. సర్వమత సారం ఒక్కటేనని, మనుషులంతా సోదర భావంతో ఉండాలన్నారు. నగరంలో ముస్లింల అభివృద్ధి కోసం కృషి చేస్తున్నట్టు దగ్గుపాటి తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, మైనార్టీ సెల్ నాయకులు కార్యకర్తలు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి వార్డులు గ్రామాల్లో పర్యటిస్తా



ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ

**బాపట్ల-నవభూమి :** ప్రజా సమస్యల పరిష్కారం కోసం వార్డులు,గ్రామపంచాయతీల్లో వారంలో ఒకరోజు పర్యటించి ప్రజా సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తానని శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ అన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక తొలిసారిగా వార్డులు, గ్రామ పంచాయతీల్లో పర్యటనకు ఈనెల 24 నుండి శ్రీకారం చుడుతున్నామన్నారు. ప్రజా సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి ప్రధానంగా వార్డు పంచాయతీల పర్యటనకు వెళు తున్నామన్నారు. అదేవిధంగా ఇటీవల జరిగిన శాసనసభ సమావేశాల్లోబాపట్లలో పర్యాటక రంగం అభివృద్ధి పై మాట్లాడాను అన్నారు. పర్యాటక కేంద్రమైన సూర్యలంక బీచ్ ని అభివృద్ధి చేయటం ద్వారా నిరుద్యోగులకు ఉపాధ్యాయ అవకాశాలతో పాటు ప్రభుత్వానికి రాబడి లభిస్తుంది అన్నారు. ఈ ప్రాంతం బోట్ టూరిజానికి అనువైన ప్రాంతంగా ఉందన్నారు. 18 కిలోమీటర్లమేర ఇక్కడ సూర్యలంక-బాపట్ల మార్గంలో పేరలి డ్రెయిన్ ద్వారా నిజాంపట్నం వరకు 18 కిలోమీటర్ల బోటు షికారు , ఫ్యామిలీ బోటింగ్ , పార్టీ బోటింగ్, కేరళ బోటింగ్ పర్యాటకులకు అద్భుతమైన అనుభూతిని కలిగిస్తుంది అన్నారు.ఇవన్నీ అభివృద్ధి చేసే దశగా కృషి జరుగుతుందన్నారు . చీరాల ఓడరేవు దగ్గరనుండి అటు రాజధాని రోడ్డు అని ఉంది . సముద్రానికి 500 మీటర్ల దూరం సమాంతరంగా బ్రిటిష్ వాళ్ళు వదిలిపెట్టి నరోడ్డు వచ్చి బాపట్ల సూర్యలంక రోడ్డులో కలుస్తోంది. దీంతో ఈ ప్రాంతంలో పర్యాటక రంగం మరింతగా ఊపందుకునే అవకాశాలు ఉన్నాయన్నారు. దీనిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. 1980లో కట్టిన మంచినీటి చెరువు అప్పట్లో 25 వేల నుంచి 30000 జనాభా ఉంటే ఇప్పుడు దగ్గర దగ్గరగా 1,10,000 నుండి లక్షా 20వేలు పెరుగుతున్న జనాభా కు అనుగుణంగా రాబోయే రోజుల్లో రెండవ మంచి నీటి ట్యాంక్ ఏర్పాటుకు సంబంధించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లానన్నారు.విద్యుత్ సమస్యను అధిగమిం చెందుకుసోలార్ పవర్ సిస్టం ప్రవేశపెడుతున్నట్లు తెలిపారు. ఈ సిస్టం ద్వారా ఎస్సీ, ఎస్టీలకు రాయితీపై విద్యుత్ అందజేయడం జరుగు తుందన్నారు. ఓసి, బిసి ఇతరులకు సోలార్ యూనిట్లపై ప్రభుత్వం సబ్సిడీ అందజేస్తుందన్నారు. ఈ విధానంతో రానున్న రోజుల్లో విద్యుత్ కు ఏమాత్రం సమస్య ఉండబోదన్నారు. ట్రూ అప్ చార్జీల పేరుతో విద్యుత్ పై భారాలను మోపిన గత వైసిపి ప్రభుత్వం నేడు కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచేస్తుందని ధర్నాలు ప్రదర్శనలు చేయడం సిగ్గుచేటు అన్నారు. సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు ముక్కామల శివ, కర్లపాలెం పార్టీ అధ్యక్షుడు ఏపూరి భూపతిరావు, పార్టీ నాయకులు బాజీ పాల్గొన్నారు.

## కాశిరెడ్డి నాయన గుడి అభివృద్ధిలో

# ఎమ్మెల్సీ గోవిందరెడ్డి గారూ మీ పాత్ర ఏమిటి

◆ బద్వేల్ టిడిపి ఇంచార్జీ రితీష్ రెడ్డి కాశి రెడ్డి నాయన గుడి అబివృద్ధికి 5 లక్షల చెక్కును ఆలయ కమిటీ వారికి అందజేత





**కాశినాయన మార్చి 14 ( నవభూమి ) :**కాశి నాయన మండలం జ్యోతి క్షేత్రంలో ఉన్న కాశి రెడ్డి నాయన ఆలయ అభివృద్ధికి నీవు కాశి నాయన మండలం వరికుంట్ల గ్రామములో జన్మించి కూత వేడు దూరంలో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి స్థానిక ఉండి ఆలయ అభివృద్ధికి ఏనాడు కృషి చేసేంది లేదన్నారు.1995 సంవత్సరం లో తమ కుటుంబం ఆలయ అభివృద్ధికి జ్యోతి క్షేత్రానికి తారు రోడ్డు , తారు రోడ్డు నీటి వసతిని మా తాత బిజివేముల , వీర రెడ్డి మంత్రి గా ఉన్న కాలంలో అభివృద్ధి జరిగిందన్నారు. 2004 సంవత్సరం లో బద్వేల్ ఎమ్మెల్యే కొనసాగారు. తరువాత బద్వేల్ నియోజగవర్గం ఎస్సీ రిజర్వుడు వస్తె అప్పటి నుండి మీకు నచ్చిన వారిని నియమించుకుని బద్వేల్ ఎమ్మెల్యే గెలుపొందుతున్న మీ ఎమ్మెల్యే ప్రస్తుత సుధా కానీ , మీరు గాని ఏనాడు అసెంబ్లీ లో శాసనమండలి లో ఏనాడు జ్యోతి క్షేత్రంలో ఉన్న శ్రీ అవధూత కాశి రెడ్డి నాయన గుడి నిర్మాణం , నిత్య అన్నదాన సత్రం గురించి మాట్లాడిన సందర్భాలు లేవు అన్నారు. మీరు మాట్లాడి ఉన్నింటె ఇక్కడ ఉన్న కాశినాయన భక్తులకు ఈ ప్రాంతం లో ప్రజలకు సమాధానం చెప్పండి. దయచేసి గుడి కోసం కష్టపడే వారికి పుల్లా మాత్రం పెట్టకండి అని బద్వేల్ టిడిపి ఇంచార్జీ రితీష్ రెడ్డి ఘాటుగా వ్యాఖ్యలు చేశారు. శ్యామల అనే వైఎస్ ఆర్ పార్టీ కి చెందిన వారు తమకు నచ్చినట్లు మాట్లాడుతున్నారు. ఈ ప్రాంతం గురించి తెలియకుండా మాట్లాడుతున్నారు అన్నారు . గత 10 సంవత్సరాలుగా గుడి నిర్మాణానికి ఫారెస్ట్ అధికారులు అడ్డంకులు సృష్టిస్తుంటే స్థానిక ఎమ్మెల్సీ , డీసీ గోవిందరెడ్డి , స్థానిక ఎమ్మెల్యే ,సుధా , ఎంపి వైఎస్ అవినాష్ రెడ్డి , పార్టీ అధికారంలో ఉన్నపుడు కాశి రెడ్డి నాయన ఆలయం నిర్మాణం , అక్కడ వసతుల గురించి పట్టించుకున్న పాపన లేదన్నారు. అలాగే ఏపీ ఖాదీ %డ% విలేజ్ ఇండస్ట్రీస్ బోర్డు చైర్మన్ కే కే చౌదరి మాట్లాడుతూ కడప జిల్లాలో మాజీ ముఖ్యమంత్రి ఉండి ఇంత మంది వైఎస్ ఆర్ పార్టీ కి చెందిన వారే ఎమ్మెల్సీ ,ఎమ్మెల్యే ఉండి ఫారెస్ట్ క్లియరెన్స్ అనుమతులు కృషి చేయలేదన్నారు. బద్వేల్ టిడిపి ఇంచార్జీ రితీష్ రెడ్డి కాశి నాయన అబివృద్దికి రూ ,5 లక్షల ఆలయ కమిటీ వారికి అందజేశారు.: కూల్చిన కట్టడాలను పునర్నిర్మించడానికి శుక్రవారం బద్వేల్ టిడిపి ఇంచార్జీ రితీష్ రెడ్డి , ఏపీ ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ బోర్డు చైర్మన్ కే కే చౌదరి, స్థానిక నాయకులతో టెంకాయలు కొట్టి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బద్వేల్ బీజేపీ అసెంబ్లీ ఇంచార్జీ , బొజ్జ రోశాన్న , మండల టిడిపి నాయకుడు , రాజరెడ్డి , (హొండా ) రవి , హుస్సేన్ పీర్ , రవీంద్ర రెడ్డి , కొండ నరసింహ రెడ్డి , అక్కి రమణ రెడ్డి , కాశి నాయన మండల బీజేపీ నాయకులు బిజీవేముల నారాయణ రెడ్డి , పోరుమామిళ్ళ సర్పంచ్ యనమల సుధాకర్ , పోరుమామిళ్ల , భైరవ ప్రసాద్ , కలస పాడు మండలం టిడిపి నాయకులు , రంతు , మాజీ డీలర్ రసూల్ ,

# పకడ్బందీగా పది పరీక్షలు

**అనకాపల్లి-నవభూమి :**వచ్చే సోమవారం నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. పరీక్షల నిర్వహణకు ముందస్తు ఏర్పాట్లలో భాగంగా గురువారం కలెక్టరేట్‌లో సంబంధిత శాఖల అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ నెల 17వ తేదీ నుంచి ఏప్రిల్ ఒకటో తేదీ వరకు 107 సెంటర్లలో నిర్వహిస్తున్న పదో తరగతి పరీక్షలకు జిల్లా నుంచి సుమారు 21 వేల మంది విద్యార్థులు హాజరుకానున్నారని తెలిపారు. అధికారులంతా సమన్వయంతో పనిచేస్తూ, ఎక్కడా ఎటువంటి సమస్యలు తలెత్తకుండా పరీక్షలు సజావుగా జరిగేలా ఏర్పాట్లు చేయాలన్నారు. పరీక్షా కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని విద్యా శాఖ అధికారులను ఆదేశించారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు ముందుగానే చేరుకునేలా బస్సులను ఏర్పాటు చేయాలని ప్రజా రవాణా శాఖ అధికారులకు సూచించారు. పరీక్షలు జరుగుతున్న సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని ఈపీడీసీఎల్ అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని సంబంధిత అధికారులకు స్పష్టం చేశారు.

## గ్రేటర్ ఎస్కేప్!



**విశాఖపట్నం- నవభూమి :**ప్రభుత్వ సంస్థలకు బకాయిల చెల్లింపులో గ్రేటర్ విశాఖ నగర పాలక సంస్థ (జీవీఎంసీ) తాత్సారం చేస్తోంది. ప్రజల నుంచి ఆస్తి/నీటి పన్నులు ముక్కుపిండి వసూలుచేసే జీవీఎంసీ...ప్రభుత్వంలో ఇతర శాఖలకు సెస్ చెల్లింపులో మాత్రం మొండిగా వ్యవహరిస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మరో మూడు వారాల్లో ముగియనున్నందున సెస్ బకాయిలు చెల్లించాలని కోరుతూ జీవీఎంసీకి జిల్లా గ్రంథాలయ సంస్థ లేఖ రాసింది.నగరంలో ఇళ్లు, ఇతర ఆస్తులకు సంబంధించి యజమానులు ఏటా ఆస్తి పన్ను చెల్లిస్తారు. అందులో గ్రంథాలయ సెస్ ఎనిమిది శాతం, విద్య సెస్ ఒక శాతం...ఉంటాయి. సెస్ వసూళ్లకు గ్రంథాలయ సంస్థకు సొంత యంత్రాంగం ఉండదు కాబట్టి స్థానిక సంస్థలే వసూలు చేసి, ఆ మొత్తాన్ని వాటికి జమ చేయాలి. అయితే గ్రామ పంచాయతీలుగానీ జీవీఎంసీ గానీ జిల్లా గ్రంథాలయ సంస్థకు సెస్ సక్రమంగా చెల్లించడం లేదు. దీంతో బకాయిలు పెరిగిపోయాయి. ఇప్పటివరకూ ఉన్న సమాచారం ప్రకారం జీవీఎంసీ నుంచి జిల్లా గ్రంథాలయ సంస్థకు రూ.100 కోట్లపైగా రావల్సి ఉంది. దీనిపై గ్రంథాలయ సంస్థ అధికారులు అనేక పర్యాయాలు జీవీఎంసీ అధికారులను స్వయంగా కలవడం లేదా లేఖలు రాయడం చేస్తూనే ఉన్నారు. ఇటీవల నగరానికి వచ్చిన రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖా మంత్రి నారా లోకేశ్‌ను కలిసి జీవీఎంసీ బకాయిలపై వినతిపత్రం అందజేశారు. వైసీపీ హయాంలో పలువురి పోరాట ఫలితంగా 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు నెలకు రూ.50 లక్షలు వంతున సెస్ బకాయిలు చెల్లించారు. తరువాత ఎన్నికలు రావడంతో జీవీఎంసీ బకాయిల చెల్లింపు నిలిపివేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగియనున్న నేపథ్యంలో గ్రంథాలయ సెస్ వివరాలు తెలియజేయడంతోపాటు కొంతమేర బకాయిలు చెల్లించాలని కోరుతూ గ్రంథాలయ సంస్థ లేఖ రాసింది. బకాయిలో 20 శాతం వరకు చెల్లిస్తే జిల్లా గ్రంథాలయ సంస్థకు నూతన భవనం నిర్మించవచ్చునని గ్రంథాలయ ఉద్యమకారులు అంటున్నారు.

## కరక కథ కంచికేనా!



**నర్సీపట్నం-నవభూమి :**గొలుగొండ మండలం కరక రంగురాళ్ల క్వారీలోకి అనుమతులు లేకుండా సర్వేకి వెళ్లిన మైనింగ్ అధికారులపై అటవీ అధికారులు చర్యలు తీసుకోకుండా షోకాజ్ నోటీసులతో తాత్సారం చేస్తున్నారు. ఇద్దరు రంగురాళ్ల వ్యాపారులతోపాటు మైనింగ్ అధికారులను కరక రిజర్వ్ ఫారెస్టులోకి పంపిన పెద్దలు ఎవరు? ఎందుకు సర్వే చేయాలని అనుకున్నారు? అన్న విషయాలు బయటకు పొక్కడం లేదు.మైనింగ్ రాయల్టీ ఇన్‌స్పెక్టర్ సత్యమూర్తి, మైనింగ్ జియాలజీ విభాగానికి చెందిన పోతి శివకుమార్, సిబ్బంది కూర్మదాసు అప్పలనాయుడు, వి.వీరనాగేశ్వరరావు, జి.రామచంద్రరావు జనవరి 31వ తేదీన గొలుగొండ మండలం సాలికమల్లవరం గ్రామానికి చెందిన రంగురాళ్ల వ్యాపారులు కె.కొండలరావు, అల్లు నూకరాజులతో కలిసి రిజర్వ్‌ఫారెస్టు పరిధిలోని కరక కొండ ఎక్కారు. కొండ మీద బేస్ క్యాంప్ సిబ్బంది వారిని అడ్డుకొని నర్సీపట్నం రేంజర్‌కి సమాచారం ఇచ్చారు. మైనింగ్ అధికారులతో సహా ఇద్దరు ప్రైవేటు వ్యక్తులను రేంజ్ కార్యాలయానికి తరలించారు. రెండు రోజులపాటు విచారణ చేశారు. అమరావతిలోని గనులు, భూగర్భ శాఖ ఓఎస్‌డీ ఆదేశాలతోనే కొరక కొండ మీదకు రాయల్టీ ఇన్‌స్పెక్టర్‌ని, సిబ్బందిని కరక కొండ మీదకు పంపాని నర్సీపట్నం మైనింగ్ ఏడీ మీడియాకు చెప్పడం సంచలనంగా మారింది. దీనినిబట్టి కరక రంగురాళ్ల తవ్వకాలకు పెద్దస్థాయిలోనే ప్రయత్నాలు జరుగుతున్నట్టు తెలిసింది. రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలో ఉన్న కరక కొండను డీనోటిఫై చేయడానికి పెద్దలు ప్రయత్నిస్తున్నారని ప్రచారం జరుగుతున్నది. అయితే జిల్లా అటవీ అధికారి శామ్యూల్ ఈ ప్రచారాన్ని కొట్టి పడేస్తున్నారు. పార్లమెంటులో బిల్లు ఆమోదం పొందితే తప్ప డీనోటిఫై చేయడం సాధ్యం కాదని 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

## పెరుగుతున్న బైక్ ప్రమాదాలు

**విశాఖపట్నం-నవభూమి :**ఈనెల ఐదో తేదీ అర్ధరాత్రి దాటిన తర్వాత తాటిచెట్లపాలెం-కంచరపాలెం రోడ్డులో బైక్ అదుపుతప్పి పక్కనే ఉన్న చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న ఇద్దరు యువకులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు.ఈనెల ఆరో తేదీ తెల్లవారుజామున హనుమంతవాకజంక్షన్‌లో లారీని వెనుక నుంచి బైక్ ఢీకొనడంతో ఒకరు అక్కడికక్కడే మృతిచెందారు.గురువారం కూర్మన్నపాలెం జంక్షన్‌లో బైక్‌ను వెనుక నుంచి లారీ ఢీకొనడంతో ఇద్దరు చనిపోయారు.నగరంలో గత వారం, పది రోజుల్లో ఐదుచోట్ల ద్విచక్ర వాహనాలు ప్రమాదాలకు గురికాగా...ఆరుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ప్రమాదాల సంఖ్య రానురాను పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. 2023లో ద్విచక్ర వాహన ప్రమాదాలు 350 జరిగితే అందులో 95 మంది వాహనదారులు ప్రాణాలు కోల్పోయారు. 2024లో 295 ద్విచక్ర వాహనాలు రోడ్డు ప్రమాదానికి గురైతే 130 మంది ప్రాణాలు కోల్పోయారు. 2025లో జనవరి, ఫిబ్రవరి నెలల్లోనే 54 బైక్‌లు ప్రమాదాలకు గురైతే...దాదాపు 21 మంది మృతిచెందడం విశేషం. ఏటేటా ద్విచక్ర వాహన ప్రమాదాలు, వాటితోపాటు మరణాల సంఖ్య కూడా పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. కొందరు అపరిమిత వేగంతో వాహనాలు నడుపుతూ హఠాత్తుగా ఏదైనా అడ్డువస్తే అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ నెల ఐదో తేదీ రాత్రి రైల్వేన్యూకాలనీ-కంచరపాలెం రోడ్డులో బైక్ రోడ్డుపక్కన ఉన్న చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. ఆరున తెల్లవారుజామున హనుమంతవాక జంక్షన్‌లో ఆగి ఉన్న లారీని వెనుక నుంచి వచ్చిన బైక్ ఢీకొట్టడంతో ఒకరు అక్కడికక్కడే మృతిచెందారు. అదేరోజు హెచ్‌పీసీఎల్ గేటు వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి పక్కనే ఉన్న చెట్టును ఢీకొనడంతో ఒకరు మృతిచెందారు. గురువారం ఉదయం కూర్మన్నపాలెం జంక్షన్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో బైక్‌పై ఉన్న ఇద్దరు అక్కడే ప్రాణాలు కోల్పోయారు.